

శ్రీ సాయి మాస్టర్ నిలయం-2 నిర్మాణం



శ్రీ సాయి మాస్టర్ విద్యాలయ నిర్మాణ పర్యవేక్షణ



సార్ దాదాపు 10సం॥లు ప్రతిరోజు తిన్న ఆకుకూర



శ్రీ సాయి మాస్టర్ నిలయంలో సార్



శ్రీ బ్రహ్మంగారి మఠంలో సత్సంగం తరువాత ధ్యానం



ప్రసన్నవదనంగా సార్



అభయమిస్తున్న సార్



సార్ సమాధి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ లీలామృతం



సమర్పణ: శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి, నెల్లూరు జిల్లా



**అంకితము: శ్రీ భరద్వాజ మాస్టర్ గారి పాదపద్మములకు**

శ్రీ సాయి మాస్టర్ నిలయంలో బోరు ఎక్కడ వేయాలనే విషయమై దీక్ష చేయాలనుకున్న రాత్రి శ్రీ సుబ్బరామయ్య మాస్టర్(సార్)కి శ్రీ వెంకయ్యస్వామి ఇచ్చిన స్వప్నసందేశం: “10 అ|| ల శ్రీ మహావిష్ణువు మౌల్డింగ్ – ఆ మౌల్డింగ్ కు గల పూలహారంలో (V) ఒక వైపు <u>**శ్రమతో సేవ**</u> రెండవవైపు <u>**సేవతో కైవల్యం**</u> అని స్పష్టంగా కనిపించింది”

**<u>సార్ వ్యాఖ్యానం :</u> శ్రమ చేస్తేనే కానీ సేవ కాదన్నమాట. గనుక నేను శ్రమించటం - నా ధ్యేయంగా పుస్తకాలు వ్రాయటం, విక్రయం, సత్సంగం చేయాలి. అలా చేస్తేనే కైవల్యం పొందుటకు అర్హులమై ఉంటాము. శ్రమ చేయించేది ఆయనే అయినా శ్రమ చేసే readi. ess మన దగ్గర వుండాలి. సోమరితనం మన ప్రధమ శత్రువు అంటారు మాస్టర్ గారు. అది దరి చేరకుండా మన శరీరాన్ని కంట్రోల్ లో పెట్టుకోవాలి.**

**సేకరణ:** ప్రసాద్, సాయి శివ, సాయి సుబ్రహ్మణ్యం

**పర్యవేక్షణ:** శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ సభ్యులు

**ప్రాప్తిస్థానము:** శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి, నెల్లూరు జిల్లా – 524321

ఈ గ్రంధ రచనకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక నమస్కారములు; సమయాభావం వల్ల కొన్నిచోట్ల ఏకవచన ప్రయోగం చేసియున్నాము. ఎవరి మనస్సునైనా బాధ పెట్టి వుంటే క్షమించగలరు

# ప్రార్థన

మాకు శ్రీ సుబ్బరామయ్య సార్ (సార్) గురువు, తల్లి, తండ్రి, స్నేహితుడు, మా కుటుంబ పెద్ద. అలాంటి మహనీయుని గురించి ఎన్ని వ్రాసినా తక్కువవుతుంది, మాకు గుర్తున్న వాటిలో కొన్ని వ్రాసుకుంటున్నాము. ఎన్ని అనుభవాలో ఇచ్చినవి! ఎంతటి దివ్యత్వమో వారిది! వాటి మననం ద్వారానైనా సార్ కి శిష్యులమవ్వాలని, బిడ్డలమవ్వాలని తాపత్రయం.

శ్రీ సార్ భోదించిన, ఆచరించి చూపిన వాటిని మనస్ఫూర్తిగా అనుసరించి ఆచరించగలిగేలా అందరమూ శ్రీ సార్ కి శిష్యులమవ్వాలనే తపనను ఆయన అంగీకరించేలాగా, ఆయనకు తగ్గ బిడ్డలమవ్వాలనే కోరికను స్వీకరించి శ్రీ సార్ అందరికీ తృప్తి, శాంతి, ఆనందాలను ప్రసాదించాలని శ్రీ సార్ కి మనః పూర్వక ప్రార్థన

శ్రీ సార్ ప్రసాదించిన మధురమైన అనుభవములను మరిచిపోకుండా అనుక్షణం గుర్తుంచుకుని ఏమరుపాటు లేకుండా సేవ చేసేటట్లు చేయమని శ్రీ సార్ ని ప్రార్థిస్తున్నాము

సార్ లీలా చింతన మాకు అత్యావశ్యకం. ఎందుకంటే మేము ఈ రోజు ఇలా ఆనందంగా, హాయిగా ఉన్నామంటే సార్ మాకిచ్చిన అనుభవాలు, శిక్షణ, అన్నిటి కంటే మమ్మ్ము కన్నబిడ్డలుగా చూసుకొని మా పాపపు సంస్కారాలను తుదముట్టించటం. అలాంటి సార్ కు అనంత కోటి వందనాలు.

సార్ నేర్పించిన ప్రార్థన “నిస్సహాయుడనై మీ పాదములను ఆశ్రయించాను. నా సర్వ బాధ్యతలు నీవే ప్రభూ! మాయ నా దరి చేరకుండా మీరే చేయండి. నా బహిరంతరముల యందున్న మిమ్మల్ని అనుక్షణం గుర్తించుచూ మీ ఆజ్ఞలు తు||చ|| తప్పక పాటించే శక్తి ప్రసాదించు స్వామీ!”

--శ్రీ సుబ్బరామయ్య సార్ భక్తబృందం

# ముందుమాట

గొలగమూడిలోని బ్రహ్మంగారి మఠం ప్రారంభోత్సవానికి శ్రీ దర్గాస్వామి (నీలకంఠరావుపేట, కడప) రాబోతున్నారు. ప్రారంభోత్సవానికి ముందురోజు బ్రహ్మం గారి మఠం దగ్గర భక్తులు సత్సంగం చేస్తున్నారు. అంతలో వర్షపు చినుకులు పడటం ప్రారంభమైనాయి. భక్తులు అందోళన చెందుతూ సుబ్బరామయ్య సార్ వంక చూస్తున్నారు. సార్ ఆకాశం కేసి చూస్తూ నమస్కారం చేశారు. వెంటనే వర్షం పడటం ఆగిపోయింది. అక్కడున్న కొంతమంది భక్తులు సార్ ని ఉద్దేశిస్తూ ‘సార్! మీ వల్లనే వర్షం పడటం

ఆగిపోయింది' అని అన్నారు. సార్ వెంటనే "అమ్మా! మనం రేపు ప్రారంభోత్సవం చేస్తున్నామని, ఇప్పుడు వర్షం పడటం మంచిదో, కాదో శ్రీవెంకయ్యస్వామికి తెలుసు అన్నప్పుడు ఇంక దాని గురించి ఆందోళన పడటం ఎందుకు?" అని చెప్పారు. సార్ నమస్కారం చెయ్యగానే వర్షం ఆగటం కన్నా, స్వామి మీద పూర్ణ విశ్వాసంతో సార్ చెప్పిన మాటలు ఎక్కువ ప్రభావితం చేసాయి. శ్రీ వెంకయ్యస్వామి దయ వలన సార్ దగ్గరకి వచ్చినప్పుడు భగవంతుని లక్షణాలు సార్ సన్నిధిలో ప్రకటం అవుతున్నాయి. గుంటూరు శివకుమారి టీచర్ గారికి గొలగమూడిలో ఒకేసారి రెండు రూపాలతో దర్శనమిచ్చిన విషయం వేణుగోపాల్ గారికి తెలిసి సార్ ని అదే విషయం అడిగితే సార్ నిర్లిప్తంగా "చైతన్యం ఎక్కడ లేదు, వేణు!" అని అన్నారు. అంతటా తానే అయిన ఆత్మజ్ఞానికి ఏది చిత్రంగా కనపడుతుంది? అంతయును ఆ చైతన్యపు క్రీడే కదా!

సార్ జీవిత విధానంలో ముఖ్యంగా ప్రభావితం చేసేవి నియమపాలన (ముఖ్యంగా ఆహార నియమం), నిరాడంబరంగా జీవించటం, ఎల్లవేళలా స్వామి సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు, సర్వప్రేరణాధికారి అని గుర్తించి తగువిధంగా విధేయులై ఉండటం, చుట్టుప్రక్కల జరిగే సన్నివేశాలతో ఏది మంచి ఏది చెడు అని గుర్తించేటట్లు కథనం చెప్పటం, తద్వారా బుద్ధికుశలతను పెంచి వివేక వైరాగ్యాలను పెంపొందించటం, నిష్కామ కర్మ చేయటం, చూసేవారికి నిష్కామకర్మ చేయాలనే బుద్ధి సార్ చెప్పకుండానే కలగటం.

## దైవం మానుష రూపేణ

దేవుణ్ణి తెలుసుకునే మార్గం చెప్పమన్న భక్తులతో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు అంటారు "నీయాల్నే వస్తే నీవేమి కనుక్కుంటావయ్యా". ఇది ఈనాడు నెల్లూరు జిల్లా గొలగమూడి వాస్తవ్యులు శ్రీ శ్రీ శ్రీ పెసల సుబ్బరామయ్య గారి ఎడల అక్షరాల నిజమైంది. వారు మానవ రూపంలో మన ముందున్న భగవంతుడే అని భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నవి.

వారెంతటి మహనీయుడో తెలియనిదే హృదయ పూర్వకమైన భక్తిశ్రద్ధలతో నమస్కరించలేము. అందరూ నమస్కరిస్తున్నారు కాబట్టి మనమూ నమస్కరిస్తాము. వారెంతటి వారో తెలియజేసి వారి యెడల మన హృదయాలలో తగువిధమైన భక్తిశ్రద్ధలు ఏర్పడునట్లు చేయడమే ఈ చిన్ని పుస్తక ఆశయం.

భగవంతునికి మూడు లక్షణాలు చెప్పారు -

1. సర్వవ్యాపకుడు: అందుగల డిందులేడని సందేహము వలదు అన్నట్లు విశ్వమందంతనూ ఉన్నవాడు
2. సర్వజ్ఞుడు: సర్వవిషయాలు తెలిసినవాడు. సృష్టిలోని ప్రతిదాని గురించి భూత భవిష్యత్, వర్తమానములన్నీ తెలిసినవాడు

3. సర్వసమర్థుడు: ఏమైనా చేయగల సామర్ధ్యము గలవాడు

శ్రీ శ్రీ శ్రీ పెసల సుబ్బరామయ్యగారు భక్తులకు అనుగ్రహించిన అనుభవాలను పరిశీలించి అందరూ సార్ కృపను పొందగలరు.

## విషయ సూచిక


| సంఖ్య | అధ్యాయము | పేజీ నెంబరు |
|---|---|---|
| 1 | శ్రీ సుబ్బరామయ్యగారి జీవితం | 5 |
| 2 | మహనీయుల తీర్పు | 7 |
| 3 | సర్వజ్ఞుడు | 9 |
| 4 | సర్వసమర్థుడు | 14 |
| 5 | ఆశ్రిత కల్పవృక్షం | 17 |
| 6 | బోధనాదక్షత | 20 |
| 7 | నియమపాలన | 22 |
| 8 | సార్ లేఖలు | 24 |
| 9 | సార్ సమాధి | 30 |


ఈ చిన్న పుస్తకము ద్వారా సార్ మధుర స్మృతులను గుర్తించి, ఆయన సన్నిధిని నిరంతరమూ అందరూ పొంది ఆనందించాలని ఆశిస్తున్నాము

# శ్రీ పెసల సుబ్బరామయ్యగారి జీవితం

శ్రీ పెసల సుబ్బరామయ్య గారు (సార్) నెల్లూరు జిల్లా చెముడుగుంటలో శ్రీ పెసల శేషయ్య మరియు శేషమ్మ అనే పుణ్యదంపతులకు జన్మించారు. సార్ తండ్రిగారు దైవభక్తి పరాయణులు. రోడ్డు మీద నడుస్తున్నప్పుడు అడ్డంగా పడివున్న ముళ్ళ కంపలను తీసివేసేవారు. చిన్నప్పుడే సార్ తండ్రిని కోల్పోయారు. సార్ అమ్మగారు అంగడి పనులు చూసుకునేవారు. ఎంత పని వున్నా రోజు దేవునికి దీపం వెలిగించి ఉన్నదానితో నివేదించి, వడ్లు దంచుకుని తినేవారు.

సార్ చిన్నప్పటి నుండి బాధలో ఉన్నవారికి చేతనైన సాయం చేసేవారు. తనకిచ్చిన (పాకెట్ మనీ) డబ్బులతో వారి ఊరిలో వున్న ఒక పెద్దావిడని నెల్లూరు హాస్పిటల్లో చూపించి ఆమెకున్న చర్మవ్యాధి తగ్గించారు. 10 వ తరగతి దాక మేనమామ ఇంట్లో వుండి చదువుకున్నారు. మేనమామ గారింట్లో నీళ్ళు తీసుకురావడం, వాకిలి కళ్లాపు చల్లటం, అంగడి చూసుకుంటూ సమయం దొరికినప్పుడల్లా చదువుకునే వారు.

చాలా కష్టపడి చదువుకుని తర్వాత సుమారు 25 సం||లు స్కూల్ టీచరుగా ఊళ్ళపాలెం, తలుపూరు, కలిచేడులలో పనిచేసారు.

శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గారి ద్వారా భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి గురించి తెలిసి, స్వామి మహనీయులని నిర్ధారించుకున్న తర్వాత స్వామికి అనన్యంగా సేవ చేసారు. స్వామి పంచశీల సూత్రాలైన "సత్యం, ధర్మం, తప్పవద్దు. సంపన్నత్వము, సాధారణత్వం, సద్గురుసేవ సాధించు" వాటిని నరనరాల్లో జీర్ణించుకుని తదనుగుణంగా జీవించారు.

స్వామి ఆదేశానుసారంగా నూనె, ఉప్పు, పులుపు, కారం లేకుండా దాదాపు 30 సం||లు జీవించారు. స్వామి ఆజ్ఞ ప్రకారం వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. దాదాపు 28 సం||లు గొలగమూడి దాటి వెళ్ళలేదు (ప్రతి సం|| నవంబర్ నెలలో ఒకరోజు నెల్లూరు వెళ్లి లైఫ్ సర్టిఫికేట్ ఇచ్చి అదేరోజు సాయంత్రానికల్లా తిరిగి గొలగమూడి చేరేవారు). గొలగమూడిలోనే వుండి సార్ సాధించిన ఘనత అద్వితీయము.

శ్రీ వెంకయ్యస్వామి గురించి, శ్రీ భరద్వాజ మాస్టర్ గురించి, ఇంకా చాలామంది మహనీయుల గురించి 40కి పైగా ఆధ్యాత్మిక గ్రంధాలు రచించారు. కొన్ని లక్షల పుస్తకాలు ఉచితంగా భక్తులకు అందించి వారిని సన్మార్గములో నడిపించారు.

భక్తులకు, సంఘానికి ఉపయోగపడే ఎన్నో కట్టడాలు కట్టారు. మచ్చుకి శ్రీ సాయి మాస్టర్ నిలయం, శ్రీ బ్రహ్మంగారి మఠం పునరుద్ధరణ, శ్రీ సాయిమాస్టర్ విద్యాలయం, శ్రీ సాయి మాస్టర్ అనాధాశ్రమం, ధ్యాన మందిరాలు

దాదాపు 20 సం||లు అవిచ్ఛిన్నంగా సత్సంగాలు చేయటం, ఆధ్యాత్మిక గ్రంధ రచన చేయటం. వాటి ద్వారా చాలామంది భక్తులకు మహనీయుల దర్శన, ఆశీస్సుల భాగ్యం కలిగించారు.

'పరోపకారార్ధ మిదం శరీరం' అని దర్గాస్వామి అన్నమాటకు కొన్ని నిదర్శనాలు

రాజగోపాల్ (ఊళ్ళపాలెంలో తోటి టీచర్)గారు తనకి వంట నేర్పించినందుకు కృతజ్ఞతగా రాజగోపాల్ గారికి గొలగమూడిలో ఇల్లు, మరుగుదొడ్డి కట్టించారు. ఆయనకి పక్షవాతం వస్తే సార్ ఆయనింటికి వెళ్లి నామం వ్రాయించటం, సత్సంగానికి రెగ్యులర్ గా రప్పించడం ద్వారా ఆయనకి పక్షవాత రోగం తగ్గించారు.

స్వామి ఆశ్రమం వాళ్ళు 2006-2007 లో అన్నం పెట్టకపోతే ఆ విషయమై ఊరి పెద్దలకి, కలెక్టర్ గారికి వ్రాసారు. ఆపద్ధర్మంగా సార్ రాజగోపాల్ గారి వాళ్ళింట్లో దాదాపు నెలపైన అన్నం పెట్టించారు

హైదరాబాద్ సాయిలక్ష్మి గారికి భయంకరమైన చర్మవ్యాధి వస్తే ఏ మాత్రం భయపడకుండా, సంకోచించకుండా సపర్యలు చేసారు.
శ్రీ సాయి మాస్టర్ నిలయంకు వచ్చే భక్తుల కొరకు ఎంతటి చలైనా లెక్కచేయకుండా గేటు దగ్గర వున్న రేకుల షెడ్ రూమ్ లో నిద్రించి వచ్చినవారికి ఏ సమయంలోనైనా సరైన వసతి కల్పించేవారు.

**నిర్భయం**

గొలగమూడి వచ్చిన కొత్తలో సార్ సత్సంగం చేసే విధానం, ఋజుప్రవర్తన వలన కొంతమందికి గుర్రు అయ్యింది. వారు సార్ ని చంపేద్దామనుకున్నారని (తలుపులు బయటనుండి గడియబెట్టి తగలబెడదామనుకుంటున్నారని) సార్ కి ఒకావిడ తెలియజేసింది. సార్ సైకిల్ మీద పారిపోదామనుకొని, శ్రీ వెంకయ్యస్వామికి దండం పెట్టుకుంటూ చచ్చేది ఎట్లాగయినా చస్తాం కదా(నాగుపాము కాటేసినా, లారి క్రిందపడినా) ఇంక ఎక్కడకీ వెళ్లనని ఇంట్లోకెళ్ళి పడుకున్నారు. స్వామిదయ వలన ఏ అపాయమూ జరుగలేదు.

సార్ శ్రీ వెంకయ్యస్వామి సమాధికి పూజ చేసే రోజుల్లో ఒకసారి ఉదయం 2 గం||లకి ఒక పోలిసు కానిస్టేబుల్ వచ్చి పెద్ద పోలిసు ఆఫీసర్ వచ్చారని, పూజ చేయ్యమని పిలిస్తే ప్రధానమంత్రి వచ్చినా అభిషేకం ఉ|| 3గం||లకి, పూజ 4గం||లకి చేయబడుతుందని చెప్పి పంపించేసారు.

## మహనీయుల తీర్పు

### శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి తీర్పు

స్వామి సేవకుడు రోశిరెడ్డికి అత్యవసర విషయములలో ఏ వ్యక్తి ఎలాంటివాడు అనే విషయముగానీ, ఎచ్చట ఏమి జరుగుచున్నది గానీ శ్రీ వెంకయ్యస్వామి దృశ్య సంకేతములతో చూపేవారు. ఒకరోజు సుబ్బరామయ్య సార్ గురించి యోచిస్తుంటే సార్ తాళాల బుర్రలు రిపేరు చేస్తున్నట్లు చూపారు. దానికి శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు ఇచ్చిన వ్యాఖ్య “అందరి లోపాలు సరిచేయగల సమర్థుడు” అంటే సార్ సర్వజ్ఞులు (లోపాలు తెలిసిన వారు), సర్వ సమర్థులు, సర్వవ్యపకులు (అందరి గురించి తెలిసినవారు) అయ్యి వుండాలి.

**శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గారి తీర్పు**

మచ్చా రామకృష్ణ (కడప వాస్తవ్యులు) కి ఒకరోజు భరద్వాజ మాస్టారు గారు కలలో కనపడి "సుబ్బరామయ్య, నేనూ ఒకటే! నువ్వు సుబ్బరామయ్య చెప్పినట్లు చెయ్యి" అని చెప్పారు.

విద్యానగర్ వసంతమ్మ గారు 2008లో గొలగమూడిలో జరిగిన శ్రీ సాయి మాస్టారు సమ్మేళనం కి ఫిబ్రవరి 8 వ తేదీ వచ్చి సార్ ని దర్శించుకుంది. సార్ ఆ రోజు వుండి తర్వాత రోజు వాళ్ళ ఊరికి వెళ్ళమన్నారు. కానీ ఆమె ఆ రోజే వాళ్ళ ఊరు వెళ్ళిపోయింది. తర్వాత కొన్ని రోజులకి శ్రీ భరద్వాజ మాస్టర్ ఆమెకి స్వప్నంలో కనపడి "సుబ్బరామయ్య ఉండమన్నా ఉండకుండా వచ్చేసావే? ఇద్దరు మహనీయులను (శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్) సేవించిన మహనీయుడు. అలాంటి ఆయన దొరుకుతాడా!" అని గద్దించారు.

బెంగుళూరు అనితగారికి ఒకరోజు ఉదయం 4 గం|| 30 ని|| కి మెలుకువ వచ్చినా పడుకునే ఉన్నారు. ఇంతలో ఆకాశవాణిలాగా మాస్టారి గారి కంఠం. "అమ్మా! అనితా! సుబ్బరామయ్య అంటే ఏమనుకున్నావు. ఇద్దరు సజీవ మహనీయులని సేవించిన మహనీయుడు" అని వినిపించింది. అప్పటి నుండి అనితగారికి సార్ మహనీయులన్న అభిప్రాయం ఏర్పడింది. కొన్ని రోజులకి గొలగమూడి వెళ్లి సార్ కి చెపితే సార్ నవ్వి "ఆయన మహానుభావుడు. ఆయనేదో చెపుతుంటారు" అని అన్నారు.

**నీలకంఠరావుపేట శ్రీ దర్గాస్వామివారు** వివిధ సందర్భాలలో శ్రీ సార్ గురించి చేసిన ప్రామాణికాలు

- జిహ్వాను జయించాడు
- సార్ ని చూపెడుతూ "పరోపకారార్ధ మిదం శరీరమ్"
- వెంకయ్యస్వామికి దత్తుడు, మాకూ దత్తుడే
- వెంకయ్యస్వామి తెచ్చుకున్నాడు నిన్ను. నీ చేత తప్పు చేయించడు
- వెంకయ్యస్వామిలో సుబ్బరామయ్య వున్నాడు, సుబ్బరామయ్యలో వెంకయ్యస్వామి స్వామి వున్నాడు

**శ్రీ సుధీంద్రబాబు గారు సార్ కి ఇచ్చిన సందేశం**

Don't care for the world, go ahead as your will says (ఈ ప్రపంచం గురించి పట్టించుకోకు, నీ ఇచ్ఛ ప్రకారం నడుచుకో!)

అరటిపండు ఇస్తే మంచివాడంటారు. ఇవ్వకుంటే పిసినారి అంటారు. వీళ్ళనేంటి లెక్క చేసేది అని చెప్పారు

కొంతమంది భక్తులకు పారాయణ ద్వారా, స్వప్న దర్శనం ద్వారా నిదర్శనాలు

నగేష్ గుర్గావ్ లో ఉద్యోగం మానేద్దామనుకుని భగవంతుని నిర్ణయం కోసం గురుచరిత్ర పారాయణ చేస్తున్నప్పుడు సార్ ఫోన్ చేసి గుర్గావ్ లో ఉద్యోగం మానేసి హైదరాబాద్ వచ్చేయమని చెప్పారు.

2011లో నగేష్ కి స్వప్నంలో చాలా పెద్ద మబ్బు సుబ్బరామయ్య సార్ లాగా మారి వెంటనే సాయిబాబాగా మారిపోయింది. అలా చాలాసార్లు సార్ గా, సాయిబాబా గా మారిపోయింది.

బెంగుళూరు ప్రసాద్ విద్యానగర్ సాయిబాబా గుడిలో శ్రీ గురు చరిత్ర పారాయణ చేస్తూ అన్ని పాపాలు సద్గురుసేవ వలన నిర్మూలమవుతాయి కదా! సార్ ఏదన్నా పని చెప్తే చెయ్యాలి అని మనస్సులో అనుకుంటుండగా సార్ ఫోన్ చేసి కొన్ని పనులు చెప్పారు.

నగేష్ కి కలలో లక్ష్మీదేవి, సరస్వతిదేవితో పాటు మధ్యలో సార్ చాలా వేగంగా వస్తూ కనపడ్డారు. సార్ వినాయకుడని మురిసిపోయాడు నగేష్.

రవికి ఒకరోజు రాత్రి కలలో (10-అక్టోబరు-2005) సార్ కనపడి వెంటనే ఆ స్థానంలో సరస్వతిదేవిగా దర్శనము ఇచ్చారు. తర్వాత రోజు సరస్వతీ పూజ!

## సర్వజ్ఞుడు

కృష్ణానది పుష్కరాలకి శుక్రవారం నాడు ప్రసాద్ చెల్లెలు (అమ్మలు) గొలగమూడి వచ్చింది. ప్రసాద్ తర్వాతరోజు (శనివారం) గొలగమూడికి వస్తే వాళ్ళిద్దరూ కలసి శనివారం రాత్రికల్లా విజయవాడ వెళ్లాలని ఆలోచన. ప్రసాద్ గొలగమూడి వెళ్ళిన తర్వాత సార్ ఆదివారం ఉదయం బయలుదేరమన్నారు. కానీ శనివారం సాయంత్రం సత్సంగం 5గం||లకి అయిన తరువాత సార్ ప్రసాద్ తో అమ్మలుని బయలుదేరదీయమన్నారు. ప్రసాద్, అమ్మలు బయలుదేరి రాత్రి 11 గం|| 30 ని|| లకి ఇంటికి వెళ్ళారు. వాళ్ళని చూసి ఇంట్లోని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎందుకు? శనివారం సాయంత్రం 6 గం|| 30 ని|| లకి ఒక సంబంధం వారితో మాట్లాడి అమ్మలిని చూసుకోవటానికి తర్వాత రోజు ఉదయం పెళ్లి చూపులకి రమ్మని పిలిచారు. తరువాత ఫోన్ చేస్తే ప్రయాణంలో వున్న ప్రసాద్ వాళ్ళకి ఫోన్ కలవలేదు. అంటే ప్రసాద్ వాళ్ళ అమ్మ, నాన్నవాళ్ళు గంటన్నర తరువాత (అంటే 6:30pm కి) విజయవాడ లో తీసుకొనే నిర్ణయాలు సార్ కి 5 pm కి తెలిసే వాళ్ళని విజయవాడకి పంపించారు.

విజయవాడ నుండి గొలగమూడికి కృష్ణా express లో వస్తూ 'పీకల దాక తిన్నాను కదా! ఇది తప్పు అయితే సార్ చెప్తారు, చెప్పాలి' అని ప్రసాద్ అనుకున్నాడు. తరువాత రోజు ఉదయం సత్సంగం ప్రారంభిస్తూనే "అతిగా తిన్న ఆహారం వల్ల వచ్చిన శక్తి నిద్ర, కడుపులో నొప్పి, కామపు ఆలోచనల ద్వారా బయటికి వెళ్ళుతుందని అన్ని వైద్య గ్రంధాల్లో చెప్పారని" ప్రస్తావించారు. ఆ విధంగా ప్రసాద్ ప్రవర్తనను సరిచేస్తూ, అతని యొక్క విశ్వాసాన్ని దృఢపరిచారు.

సార్ స్వామి మాట ప్రకారం కోసేరు దాటి వెళ్ళరు కాబట్టి సెల్లూరు వెళ్లి సార్ కి కావలసిన పని ఏదైనా వుంటే చేసుకొద్దాము అనుకుంటూ గొలగమూడి చేరాడు సాయి శివ. ఇంట్లోకి వెళ్ళక ముందరే సార్ కనపడి "ఏం శివా సెల్లూరు వెళ్లి వస్తావా?" అని నవ్వుతూ అడిగారు. శివ కూడా నవ్వి అలాగే సార్ అన్నాడు. సార్ వెంటనే "నువ్వు భలే ఇంజనీరువయ్యా, వెంటనే కనిపెట్టేస్తావు" అని అన్నారు.

సద్గురు కృప మ్యాగజైను వాళ్ళు ప్రతిసెలా సార్ కు కొన్ని ప్రతులు పంపిస్తారు. వాటిని సార్ వచ్చిన భక్తులకు ఇస్తూ వుంటారు. ఒకసారి సత్సంగంలో అలా ఇస్తూ వుంటే గొర్తి రవి మనస్సులో 'నాకెందుకు సార్ నేను చదవను పెట్టను' అని అనుకుంటుండగా సార్ రవికి మ్యాగజైను ఇస్తూ నవ్వుతూ "నువ్వు చదవకపోయినా శివ రూములో వున్నాడు కదా అతను చదువుతాడు" అని ఇచ్చారు.

వేణుగోపాల్ గారు గొలగమూడిలో సర్వేపల్లి రోడ్డు వెంబడి స్థలం కొందామనుకుని సార్ కి చెప్తే వద్దన్నారు. తర్వాత సంవత్సరానికి ఆ స్థలాలన్నీ గవర్నమెంటు వారు తీసేసుకున్నారు.

రవికుమార్ గారు (విద్యానగర్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్) అమ్మగారికి మోకాళ్ళ నొప్పులు వున్నాయని సార్ కి చెప్తే "హైదరాబాద్, బెంగుళూరు లలో ఎక్కడైనా నేచర్ క్యూర్ (ప్రకృతి వైద్యశాల) హాస్పిటల్లో చేర్పించ"మన్నారు. బెంగుళూరు నేచర్ క్యూర్ హాస్పిటల్ లో వాళ్ళ అమ్మ గారితో పాటు ఆయన కూడా జాయిన్ అయ్యారు. ప్రసాద్ వెళ్ళినపుడు ఎందుకు హాస్పిటల్లో చేరారో మొత్తం విషయం చెప్తే ప్రసాద్ "సుబ్బరామయ్య సార్ చెప్పారంటే టిక్ మార్క్ వేసినట్టే" అని రవి కుమార్ గారితో అన్నాడు. తర్వాత వారం ప్రసాద్ తన ఉపనయనం గురించి సార్ కి చెపుదామని వెళ్ళితే సార్ మాట్లాడుతూ రవికుమార్ గారి గురించి చెప్తూ "నేను చెప్పానని వాళ్ళ అమ్మతో పాటు అతను కూడా హాస్పిటల్లో చేరాడు. అయినా టిక్ మార్క్ వేసేశాను కదా" అని అన్నారు. బెంగుళురులో వారం క్రితం ప్రసాద్ చెప్పిన మాట గొలగమూడిలో సార్ చెప్పటం ఎంతటి చిత్రమో కదా!

ఒక శనివారం నాడు భక్తులతో మాట్లాడుతున్న సార్ ప్రసాద్ తో "మనం చేస్తామని ఆయన, ఆయన చేస్తాడని మనం, ఎందుకు గానీ వేణుకి ఫోన్ చేయమని" చెప్పారు. వెంటనే ఫోన్ చెయ్యగానే వేణుగోపాల్ గారు సార్ తో మాట్లాడుతూ తర్వాత రోజుకి గొలగమూడి వస్తున్నాను, మాట్లాడతాను సార్ అని చెప్పారు. ఆదివారం నాడు వచ్చిన వేణుగోపాల్ గారు ప్రసాద్ తో ఇలా చెప్పారు 'రెండు వారాల నుండి సార్ కి ఫోన్ చేద్దామనుకుంటున్నాను కానీ మరచి పోతున్నాను. పైగా సార్ దగ్గరనుండి ఫోన్ కూడా రాలేదని మనస్సులో బాధ పడుతున్నాను. నిన్న మీ ఫోన్ చూడగానే సార్ దగ్గరనుంచే అనుకున్నాను' అని చెప్పారు. ఎక్కడో కల్పాకంలో ఉన్న వేణుగోపాల్ గారి మనస్సులోని విషయాలు గొలగమూడిలో ఉన్న సార్ కి ఎలా తెలుస్తాయి? అంతటా వున్న చైతన్యానికి తప్ప దేనికి సాధ్యమౌతుంది!

శేషుకృష్ణ శ్రీ సాయి మాస్టర్ నిలయంలో భరద్వాజ మాస్టర్ పటానికి నమస్కారం చేస్తూ 'మాస్టారూ! చాలా కష్టాలు పడ్డాము. ఇప్పుడు బాగున్నాము. మరలా ఈ కష్టాలు రానీయకండి' అని ప్రార్థించుకున్నాడు. బయట నగేష్, ప్రసాద్ పనిచేస్తున్నారు. శేషు వాళ్ళని చూస్తున్నాడు. ప్రక్కనే వున్న సార్ "కష్టాలు రాకుండా వుండాలని నమస్కారం చేస్తేనే చాలదు, మనం పనిచేస్తూ వుంటే కదా!" అని చెప్పి శేషుని పనికి పురమాయించారు.

ఒకసారి మధ్యాహ్న ఆరతి చివర్లో శేషుకి తన ప్రమేయం లేకుండా 'నన్ను సార్ భోజనం చేయమని అంటే మహనీయులని నమ్ముతాను' అని అనుకున్నాడు. సార్ ఆ రోజు ముందర వైపు ద్వారం గుండా ఇంటి లోపలకి అడుగు పెడుతూ ఆగి శేషువైపు తిరిగి "భోజనానికి వెళ్ళు" అని చెప్పారు. అ సమయంలో సార్ కళ్ళను చూసిన శేషుకి సార్ కి అన్నీ తెలుస్తాయి అని అనిపించింది.

ఒకసారి వేణుగోపాల్ గారితో కలిసి Village Assistant(Nellore)ను కలవటానికి వెళ్ళినపుడు ప్రసాద్ తనకు చిన్నప్పుడు నుంచి జరిగిన అనుభవాలు చెప్పాడు. కానీ తనకు జరిగిన అనుభవాలు సాయిబాబా, సుబ్బరామయ్య సార్, వెంకయస్వామి, దర్గాస్వామి, భరద్వాజ మాస్టర్ వల్ల జరిగాయి కదా ఇదంతా ఒకరే చేసారు అని చెప్పలేకుండా ఉన్నానే అని మనస్సులో doubt వచ్చింది. ఆ రోజు సాయంత్రం సత్సంగంలో సార్ మొదలుపెడుతూనే "రూపాలు వేరైనా సద్గురువు ఒక్కడే " అని ప్రసాద్ doubtని clarify చేసారు.

ఒకసారి ఆఫీసులో పని చాలా రొటీన్ గా ఉండి, ప్రసాద్ కి విసుగుపుట్టి ఉద్యోగం రాజీనామా చేసి Nellore దగ్గర ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్ గా చేరుదామనుకుని

రవికుమార్ గారితో చెబితే 'ఇక్కడకి వచ్చి ఏం చేస్తావు. కొన్ని కాలేజీల్లో మెకానికల్ ఇంజనీరింగ్ లేదు, తొందరపడి నిర్ణయం తీసుకోకు' అన్నారు. అంత చెప్పినా ప్రసాద్ మనస్సు మారలేదు. తరువాత గొలగమూడికి వెళ్ళాడు. సార్ కి చెప్పలేదు. సార్ సత్సంగం లో భరద్వాజ మాస్టర్ గురించి మాట్లాడుతూ మధ్యలో సందర్భం లేకుండా వేలు ప్రసాద్ వైపు చూపి "ఉద్యోగం రాజీనామా చేయవద్దు" అని చెప్పి మరలా భరద్వాజ మాస్టర్ గురించి చెప్పడం కొనసాగించారు. ఆ మాటలకు ప్రసాద్ కు ఉద్యోగం మానాలనే ఆలోచన పోయింది. సార్ అలా చేసారు కాబట్టే ఈనాడు ఆర్థికంగా ఏ ఇబ్బందీ లేదు.

సాయి సుబ్రహ్మణ్యం గొలగమూడి స్వామి సమాధికి కొన్ని రోజులు ఒకే సమయంలో ప్రదక్షిణలు చేసేవాడు. ఆ సమయంలోనే ఒక అమ్మాయి కూడా ప్రదక్షిణలు చేస్తుండేది. స్వామి మీద ఉండవలసిన సాయి మనస్సులో ఆ అమ్మాయి గురించి ఆలోచనలు వస్తుండేవి. ఒకరోజు మందిరానికి వెళదామనుకుని కూడా వెళ్ళినా 'ఆ అమ్మాయి వుంటుంది, ఆ అమ్మాయి మీద ఆలోచనలు వస్తాయి, తరువాత వెళదాములే' అని మనస్సులో అనుకుని రూమ్ లో కూర్చున్నాడు. ఈ విషయం ఎవరితోనూ ప్రస్తావించలేదు. కొంతసేపటికి సార్ వచ్చి "ఇప్పుడు ఆ అమ్మాయి ఉండదు కానీ, నువ్వు వెళ్ళి ప్రదక్షిణలు చేసిరా" అని చెప్పారు.

సురేష్(టీచర్, అల్లంపాడు)ని ఒంటిపూట తింటూ దీక్ష చేయమన్నారు సార్. కొన్నిరోజులు కష్టంగా చేసిన తర్వాత ఒకరోజు ఉదయం విద్యానగర్ సాయిబాబా గుడి ధునిలో కొబ్బరికాయ సమర్పిస్తూ 'ఈ ఒంటిపూట భోజనాలు చెయ్యలేను, నన్ను చంపెయ్యి' అని విన్నవించుకున్నాడు. తర్వాత బయలుదేరి మధ్యాహ్నానికి గొలగమూడి వచ్చి సాయిమాస్టర్ నిలయంలో మధ్యాహ్న ఆరతిలో పాల్గొన్నాడు. ఆరతి అయ్యిన తర్వాత సురేష్ తో " మనకీ ఈ ఒంటిపూట భోజనాలు కష్టం కానీ, నీవు మూడు పూటలా భోజనం చెయ్యి" అన్నారు. ఎవరూ ఏమీ చెప్పకుండా ఎక్కడో సాయిబాబా గుడిలో జరిగిన విషయం సార్ కి ఎలా తెలుసు?

సురేష్ స్కూల్లో బాగా అల్లరి చేస్తున్న ఒక పిల్లవాడ్ని కసిగా మెడ దగ్గర చేత్తోనలిపాడు. సాయంత్రం గొలగమూడికి రాగానే సార్ సురేష్ తో "ఎందుకు అంత కసిగా కొడతావు" అని అడిగి ఆ పిల్లవాడి రూపంలో నేనే ఉన్నానని, నువ్వు ఏమి చేస్తున్నా తెలుస్తోందని చెప్పినట్లుంది.

ఒక భక్తుడు (నగేష్ స్నేహితుడు) లెక్చరర్ గా పని చేస్తూ తన స్టూడెంట్ ని ప్రేమించాడు. పెళ్ళి చేసుకుందామని తన తల్లిదండ్రులకు చెబితే వారికి ఇష్టం లేదని, అలా కనుక చేస్తే ఆస్తిలో వాటా రాదు, ఇక సంబంధాలు ఉండవు అని చెప్పేసారు. కానీ

అతనికి వ్యామోహం వల్ల ఆ అమ్మాయి కోసం తల్లిదండ్రులనైనా వదులుకుందామనుకున్నాడు. ఈ విషయం నగేష్ కి చెబితే 'గొలగమూడికి వచ్చి స్వామి దర్శనం చేసుకుని సుబ్బరామయ్య సార్ కి చెప్పు అని' సలహా ఇచ్చాడు. అలానే రాజేష్ గొలగమూడి వచ్చి స్వామి దర్శనం చేసుకున్నాడు. కానీ సార్ తో ఏకాంతంగా మాట్లాడే అవకాశమే రాలేదు. మనస్సులోనే చెప్పుకుని తన ఊరు బయలుదేరాడు. బస్సులో నిద్ర తూగినప్పుడు సార్ కనబడి "ఇది తప్పు" అని చూపించారు. అంతే అప్పటి నుండి రాజేష్ వ్యామోహం తగ్గిపోయింది. అంతేకాకుండా డిగ్రీ మధ్యలో ఆ అమ్మాయి కాలేజి నుండి వెళ్ళిపోయింది. సార్ ఒక్కమాటతో రాజేష్ ని ఎంతో పెద్ద తప్పు చేయనీయకుండా కాపాడారు.

శివశంకరయ్య సెప్టెంబర్ 3 వ తేదీన గొలగమూడి వచ్చి స్వామి దగ్గర ప్రదక్షిణలు చేసిన తర్వాత సార్ తో '5th సెప్టెంబర్ (సోమవారం) ఉదయం అనంతపురం M.Sc(Physics) కౌన్సిలింగ్ కి వెళ్ళాల'ని చెప్పాడు. సార్ వెంటనే "ఈ మూడు రోజులు ఉండి స్వామి ప్రదక్షిణలు, పారాయణ చేసి వెళ్ళు, స్వామి ఎలా చేస్తాడో చూడు" అన్నారు. శివశంకరయ్య 'Monday మార్నింగ్ కల్లా అక్కడ ఉండాల'ని చెపితే సార్ "సర్లే ఈ రెండు రోజులు ప్రదక్షిణలు, ఒకరోజులో పారాయణ" చేయమన్నారు. శివశంకరయ్య పెద్దన్నయ్య అనంతపురం Sunday ఉదయానికి వెళ్లి ఎంక్వయిరీ చేస్తే ఇంటర్వ్యూలు Postpone అయినాయని తెలిసింది. అందుకు ఫోన్ చేసి ఆదివారం రాత్రి బయలదేరవద్దని శివశంకరయ్యతో చెప్పాడు. శివశంకరయ్య సోమవారం కూడా ప్రదక్షిణలు, పారాయణ చేసుకున్నాడు. సోమవారం సాయంత్రం immediate గా రమ్మని వాళ్ళ పెద్దన్నయ్య చెప్పాడు. Wednesday counselling జరిగి M.Sc(ఫిజిక్స్) లో అడ్మిషన్ దొరికింది. అలా సార్ చెప్పినట్లు మూడు రోజులు ప్రదక్షిణలు, పారాయణ చేసి వెళ్ళిన శివశంకరయ్యకి M.Sc(Physics)లో సీటు వచ్చింది.

Hyd పి. వెంకటేశ్వరావు గారి నాన్నగారికి టైఫాయిడ్ 1999 లో వచ్చి చాలా ఇబ్బంది చేస్తే వాళ్ళ అమ్మగారు సార్ కి చెప్పుకున్నారు. సార్ "మొదట్లో కాస్త ఇబ్బంది చేస్తుంది, తరువాత సర్దుకుంటుంది" అని చెప్పారు. తరువాత హాస్పిటల్లో చేర్పించారు. డాక్టర్లకి రోగం అంతు పట్టలేదు. ఒక రోజు రాత్రి వెంకటేశ్వరావుకి, వాళ్ళ అమ్మగారికి స్వప్నంలో శ్రీ శ్రీ శ్రీ వెంకయస్వామి కనపడ్డారు. అదే రోజు రాత్రి వాళ్ళ నాన్నగారు బెడ్ మీద నుండి లేచి యూరినల్స్ కి నడిచి వెళ్లి వచ్చారు. అప్పటి నుండి ఇప్పటికి ఆయన దాదాపు 17సం||లు ఆరోగ్యంగా జీవించారు.

కార్తీక్ సార్ చేత స్వామిదారం కట్టించుకుందామనుకున్నాడు. సార్ తో పాటు కార్తీక్ స్వామి కుటీరానికి వెళ్లి దారం తీసుకునే లోపల సార్ బయటికెళ్ళి పోయారు. సార్ వెళ్లిపోయి ఉంటారనుకున్నాడు. కానీ సార్ బయట ఆకాశంకేసి చూస్తున్నారు. బయటకు వెళ్ళగానే కార్తిక్ వైపు చూసి చేయి చాచి ఏదో ఇవ్వు అన్నట్లు అడిగారు. వెంటనే దారం ఇచ్చాడు కార్తీక్. సార్ కుడిచేతికి దారం కడుతుంటే ఒకతను ఎడమ చేతికి కట్టాలని చెప్తున్నాడు. సార్ వెంటనే "ఏ! ఈ చెయ్యి కట్టించుకోదా" అని అడిగి దారం కట్టారు.

# సర్వ సమర్ధుడు

శివరత్నం 40 రోజులు దీక్ష చేద్దామనుకుంటున్నానని సార్ కి చెప్తే "స్వామికి పారాయణ, ప్రదక్షిణలు చెయ్యి, వార్తా పత్రికలు చదవకూడదు" అని చెప్పారు. అలానే దీక్ష పూర్తయిన తర్వాత రోజు పేపరు చూస్తే నెల్లూరులో ఆర్. ఎస్. ఎస్ స్కూళ్ళలో టీచర్ల నియామకాలు జరిగాయి అని వుంది. సార్ దగ్గరకొచ్చి 'పేపరు చూసినట్లయితే అప్లికేషన్ పెట్టుకోనేవాడిని, ఉద్యోగమేమైనా వచ్చేది సార్' అని వాపోయాడు. సార్ శివరత్నంతో ఈరోజు నెల్లూరు వెళ్లి ఇంటర్వ్యూలు జరిగిన స్కూలు హెడ్మాస్టర్ తో మాట్లాడి రమ్మన్నారు. ఈ రోజు వెళితే ఏమీ ప్రయోజనం లేదు సార్ అంటే "కర్మ క్షాళన అవుతుంది వెళ్లిరా!" అన్నారు. నెల్లూరు వెళ్లి హెడ్మాస్టర్ ని కలిస్తే 'నిన్న అయితే ఇవాళ ఎందుకు వచ్చావు' అని అడిగితే మా సార్ వెళ్లి రమ్మన్నారు అందువలన వచ్చాను అని చెప్పాడు శివరత్నం. ఆ హెడ్మాస్టర్ మీ సార్ ఎవరు అని అడిగి సార్ గురించి మొత్తం వివరాలు తెలుసుకుని శివరత్నం చేత బయోడేటా వ్రాయించి హైదరాబాద్ పంపించారు. ఒక నెల తర్వాత ఏ ఇంటర్వ్యూ లేకుండా ఖమ్మం స్కూలులో టీచరు ఉద్యోగం వచ్చింది. కానీ సార్ ఆ జీతానికి అంతదూరం పోనవసరము లేదని చెప్పగా శివరత్నం విరమించుకున్నాడు.

ఒకసారి పూజలో (ఒక వారం రోజులు పాటుగా ప్రతిరోజు) అంతకు ముందు జరిగిన తప్పు గుర్తుకి వచ్చి మనస్సు distrub అవుతుంటే ఆ విషయం గురించి సార్ కి చెప్పక పోవటం blunder గా తలచి వెంటనే సార్ కి లెటర్ వ్రాసాడు ప్రసాద్. అంతే మరుక్షణం నుండీ ఆ చెడ్డ ఆలోచనలు మరలా రాలేదు. ఆ వారంలో శనివారం గొలగమూడికి వెళ్ళినపుడు విషయం సార్ కి చెబితే "చిన్నతనంలో తప్పులు జరిగి వుండవచ్చు. వెంకయస్వామి దగ్గరకి వస్తున్నావు కదా ఆయనే మారుస్తార"న్నారు. అప్పటి నుండి మరలా అలాంటి ఆలోచనలు రాలేదు.

సార్ ప్రసాద్ ని స్వామి దగ్గర ప్రదక్షిణలు అయిన తర్వాత స్కూలు దగ్గర కరెంటు పని లైనుమేన్ చేత చేయించి రమ్మన్నారు. ప్రక్కనే వున్న Nagesh సార్ తో 'నా ప్రదక్షిణలు త్వరగా అయిపోతాయి, నేను ఆ పని చేయించుకుని వస్తానని సార్ ని ఒప్పించాడు'. ప్రదక్షిణలు తర్వాత పని చేస్తుంటే నగేష్ కి 10,000 వోల్టులు కరెంటు వైరు తగిలినా ఏమీ అవలేదు. అదే వైరు అతనితో పాటు పనిచేసే లైనుమేన్ అసిస్టెంట్ కి తగలకుండా ప్రక్కనుండి వెళ్ళినందుకు అతని శరీరం బాగా కమిలిపోయింది. అంత వోల్టులు ఉన్న వైరు తగిలితే చావటం ఖాయం. కానీ Nagesh కి ఏమీ కాకపోవటం సార్ కృప కాక మరేమిటి?

2008 సాయి మాస్టర్ భక్త సమ్మేళనమప్పుడు ప్రసాద్ నియమాలు పెట్టుకొని చాలా తక్కువగా ఆహారం తీసుకుంటూ నీరసం వల్ల పని చలాకీగా చేయలేకపోయేవాడు. ఈ విషయం గ్రహించిన వేణుగోపాల్ గారు (సమ్మేళన పనుల ఇన్-చార్జ్) సార్ కి ప్రసాద్ పెట్టుకున్న నియమాలు గురించి చెప్పారు. వెంటనే సార్ ప్రసాద్ తో "ఏమి స్వామీ! ముంచుతావా? ఏమిటి? ఏది కావాలో అది తొక్కేయ్, నాదీ పూచీ" అని అభయమిచ్చారు. అప్పటి దాకా రాత్రి పూట రెండు బాగా మాగిన అరటి పళ్ళు తింటే ఉదయం నిద్ర లేచినా, ప్రదక్షిణలు చేస్తున్నా బాగా మత్తుగా వుండేది. అలాంటిది సార్ చెప్పినప్పటి నుండి ఒక వారం పాటు రాత్రి కడుపు నిండా అన్నం తిన్న తర్వాత అరడజను అరటిపళ్ళు తిన్నా ఉదయమే 2 గం|| 30 ని|| కల్లా నిద్ర లేచి చాలా ఉత్సాహంగా ప్రదక్షిణలు చేయగలగటం చాలా విచిత్రం. ప్రసాద్ శరీరములో ఏమి మార్పులు చేసారో ఏమో!

ప్రసాద్ తణుకు హోమియో క్లాసులకి వెళ్ళినప్పుడు ప్రక్కింటి ఆవిడ అందచందాలను చూసి తప్పని తెలిసినా చూసేవాడు. మూడు వారాల క్లాసులు ఇంకొక వారం పొడిగించే సరికి ఆ వారం శెలవు పెట్టాలో లేదోనని సార్ కి ఫోన్ చేసి అడిగేటప్పుడు పూర్తి విషయం చెప్పకుండా 'ఇక్కడ పిచ్చి పిచ్చి వేషాలు వేస్తున్నాను సార్' అని చెప్పాడు. తర్వాత రెండు రోజుల పాటు ఏ సన్నివేశాలు జరగాలో (కల్లాపు చల్లటం, ముగ్గు వేయటం మొ||) అవి ఏమీ జరగలేదు. పైగా మూడవ రోజు నుండి ప్రక్కింటి ఆవిడ కనపడినా మనస్సులో ఎలాంటి చెడ్డ ఆలోచనలు రాలేదు పైగా వివేకం ఉదయించి అలా చేసినందుకు తన మీద తనకే అసహ్యమేసింది. సార్ కి విన్నవించుకోగానే ఇంత మార్పు రావటమేమిటి? ఓం అరిషడ్వర్గ వినాశకాయ నమః

సాయిశివ తన ఉపనయనమప్పుడు వాళ్ళ పెద్దమ్మ చేసిన ఆహారం తిన్నాడు. అతనేమీ పట్టించుకోక పోయినా వాళ్ళ అమ్మగారు మాత్రం సార్ దగ్గరకొచ్చినప్పుడు సార్

తో 'ఇన్ని సంవత్సరాలు తన వంట తానే తిన్నాడు, ఉపనయన మప్పుడు ఆ నియమం తప్పిపోయింది' అని వాపోయారు. సార్ "వెంకయ్యస్వామి శివను పోనివ్వడు" అని అన్నారు. కొన్ని రోజుల తర్వాత సార్ కడప రామకృష్ణతో చాలా అకస్మాత్తుగా "శివకి ఫోను చెయ్యి" అని చెప్పి ఫోను చేయించారు. సరిగ్గా ఆ సమయంలో శివ వాళ్ళ పెద్దమ్మ వాళ్ళింట్లో వున్నాడు. సార్ ఫోను చేసి హెచ్చరించటం వల్ల మరలా నియమభంగం కానివ్వకుండా కాపాడారు. సార్ "స్వామి పోనివ్వడు" అని చెప్పారు కానీ సార్ ఫోన్ చేసి నియమభంగం అవకుండా కాపాడారు. అంటే సార్, స్వామి వేరు కాదా? అందుకే పెద్దలు చెపుతారు 'రూపాలు వేరైనా సద్గురువు ఒక్కడే'. సార్, స్వామి ఒకటే!

2004 వ సం|| ఫిబ్రవరి నెలలో గుంటూరు శివకుమారి టీచరు గారు తెల్లవారు ఝామున 5 గం|| 30 ని||లకి పూజ అయిన తర్వాత గొలగమూడి స్వామి సమాధి దర్శనం చేసుకుంటుంటే సార్ మందిరంలో కూర్చుని కనిపించారు. బాగా గడ్డం, నీరసంగా వున్నారు. చలి వలన అలా ఉందనుకుని అక్కడ ఉన్న ఒకతనిని 'ఆయన ఎవరు?' అని అడిగితే 'సుబ్బరామయ్య అయ్యవారు' అని చెప్పాడు. దర్శనం చేసుకున్న వెంటనే సార్ దగ్గరకి వెళ్లి 'ఏమిటి సార్ ఆరోగ్యం బాగోలేదా?' అని అడగంగానే సార్ పైకి లేచి "ఏం నువ్వేమన్నా బాగు చేస్తావా" అని అంటూ నాలుగు అడుగులు బయటకు నడుస్తూ అదృశ్యం అయిపోయారు. ఒక్కసారి షాక్ చెందిన శివకుమారి గారు తేరుకుని సార్ సాయిమాస్టర్ నిలయంలో ఉదయ ఆరతికి వస్తారు కదా అని వెంటనే సాయిమాస్టర్ నిలయంకి వెళ్ళారు. అక్కడ సార్ తెల్ల పంచె, కండువా లో నీటుగా గడ్డం లేకుండా చాలా హుందాగా వున్నారు. శివకుమారి గారిని చూసి చిరు దరహాసం చేసి ఆరతిలో నిమగ్నమై పోయారు. ఈ విషయం తెలిసి వేణుగోపాల్ గారు సార్ ని అడిగితే "'చైతన్యం ఎక్కడ లేదు, వేణూ!" అని నిర్లిప్తంగా అన్నారు.

2015వ సం|| నవంబరు 29వ తేది నుండి డిసెంబర్ మొదటి వారం వరకు చెన్నైని భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. శ్రీ రామకృష్ణ భట్టు(చెన్నై) గారి స్నేహితులు ఉండే ప్రాంతాల్లో మొదటి, రెండవ అంతస్థుల దాకా వరద నీరు వచ్చేసిందని ఊరు విడిచిపోతున్నారు. తాను ఉండేది గ్రౌండ్ ఫ్లోర్ లో కాబట్టి ముఖ్యమైన సర్టిఫికెట్లు, విలువైన వస్తువులు మూటకట్టి పెట్టుకున్నాడు. ఎక్కడా కరెంటు కానీ ఫోన్లు కానీ రవాణా సౌకర్యాలు కానీ లేవు. డిసెంబర్ 2వ తేది మధ్యాహ్నం వరకు శ్రీ రామకృష్ణ వుండే ముగలివాకం ప్రాంతంలో పెద్దగా నీరు చేరలేదు. కానీ సాయంత్రం 4 గం||లకి మా ప్రహరి గోడ ప్రక్కన 3 అడుగులు పైగా నీళ్ళు చేరేసరికి చాలా భయమేసింది. వర్షం జోరుగా పడుతోంది. అలానే కొనసాగితే ఇక ఇంటిలోకి నీరు చేరటం తథ్యం. ఆ

ఆలోచనలతో ఇంట్లోకి వెళ్లి పడకగదిలో కూర్చుంటే ఆ వర్షం హోరుకి చెవులు చిల్లులు పడేలా ఉన్నాయి. ఇక ఆ టెన్షన్ తట్టుకోలేక వెంటనే సార్ ని మనస్సులో తలుచుకొని "సార్! నాకు భయమేస్తోంది. ఈ పరీక్ష చాలు. దయచేసి రక్షించండి" అని చెప్పుకున్నాడు. వెంటనే అంత జోరుగా టప టప టప టప మని కురుస్తున్న వాన చప్పుడు ఆగిపోయి, చిన్నగా టపా......టపా అని చూరునీళ్ళు పడుతున్నట్లుగా మారిపోయింది. బయటకి వచ్చి చూస్తే అప్పటిదాకా ఆకాశం చిల్లులు పడినట్లు కురిసిన వాన చిన్న చిన్న చినుకులుగా మారిపోయింది. అ క్షణాన సార్ కూడా ఉన్నారనే ధైర్యంతో అతని భార్యతో మనకేమీ భయం లేదు అని చెప్పాడు. అలాగే క్రమంగా వర్షం తగ్గి, ఏ ఇబ్బందీ లేకుండా గడిచిపోయింది.

## ఆశ్రిత కల్పవృక్షం

2013లో ఒకరోజు తెల్లవారుఝామున నగేష్ నాన్నగారికి గుండెపోటు వస్తే విజయనగరంలో వాళ్ళింటి నుండి విశాఖపట్నంలో ఒక హాస్పిటల్ లో చేర్పిస్తున్నామని వాళ్ళ తమ్ముడు ఫోను చేసి చెప్పాడు. ఉదయము బయలుదేరుతూ సార్ కి ఫోన్ చేసి విషయం చెప్పి విశాఖపట్నం వెళుతున్నానని చెప్పాడు. సార్ వెంటనే "నువ్వు వెళ్లి ఏం చేస్తావు, ఇంజక్షను పొడుస్తావా?" అన్నారు. సార్ చెప్పేది అర్థం గాక నగేష్ 'సార్ మీరు నన్నేం చేయమంటారో చెప్పండి' అని అడిగితే సార్ "రెండు రోజుల తర్వాత అవసరమైతే వెళ్ళవచ్చులే" అని చెప్పారు. చాలా చిత్రంగా నగేష్ వాళ్ళ నాన్నగారికి ఆరోగ్యం చేకూరి డాక్టర్లనే ఆశ్చర్య పరిచింది.

వేణుగోపాల్ గారికి గొలగమూడికి వస్తూ నెల్లూరు దగ్గరకి వచ్చేసరికి బాగా కడుపు నొప్పి వచ్చింది. అలానే నొప్పితో గొలగమూడి వచ్చి సార్ కి చెప్తే సార్ విభూతి పెట్టారు. అంతే వెంటనే కడుపులో నొప్పి తగ్గిపోయింది.

ఒకసారి సందర్భం లేకుండా ప్రసాద్ తో "నీకు పెళ్లి అవదు అనుకుంటున్నారేమో, పిల్ల పుట్టి వుందని మీ అమ్మతో చెప్పు" అన్నారు. ప్రసాద్ ఇంటికి ఫోను చేసినప్పుడు వాళ్ళ అమ్మ ఇంట్లో లేదు. సార్ చెప్పమన్న విషయం ప్రసాద్ వాళ్ళ నాన్నగారికి చెప్పేసరికి వాళ్ళ నాన్న చాలా ఆత్రంగా 'సార్ ఆ మాట అన్నారా' అని రెండు మూడుసార్లు అని అడిగారు. ప్రసాదుకు పెళ్లవ్వట్లేదని ఇంట్లో వాళ్ళు బెంగపడిన దానికి సార్ చాలా విచిత్రంగా వారి బెంగతీర్చారు.

హైదరాబాద్ పి. వెంకటేశ్వరావు అన్నయ్యకి పెళ్లి సంబంధాలు కుదరట్లేదు. వెంకటేశ్వరావుని పెళ్లి చేసుకోమని ఇంట్లో వారందరూ బలవంతం చేస్తున్నారు. సార్ కి

వచ్చి విషయం చెప్పాడు. "మీ అన్నయ్య పెళ్ళితో నీ పెళ్ళికి సంబంధం లేదు. నీది లేటు అవుతుంది. 5 వారాలు వరసగా మీ అన్నయ్యని గొలగమూడి స్వామి దర్శనానికి రమ్మను. ఆ తరువాత పెళ్లి కాకపోతే స్వామిది తప్పు అవుతుంది" అని సార్ చెప్పారు. వెంకటేశ్వరావు వాళ్ళ అన్నయ్యకి చెప్తే ఆతను వెంటనే 'నన్ను తీసుకు వెళ్ళు, తరువాత 4 వారాలు నేను వెళతానని' చెప్తే తరువాత రోజే తీసుకుని వెళ్ళాడు. తరువాత 4 వారాలు కూడా వరుసగా వచ్చాడు. తరువాత నెల తిరిగే లోపు అతని పెళ్లి జరిగింది. వెంకటేశ్వరావుకి వాళ్ళ అన్నయ్య పెళ్లి జరిగిన రెండు సంవత్సరాలకి పెళ్లి జరిగింది.

సురేష్ (టీచర్, అల్లంపాడు)ని తన వంట తను చేసుకుని తినమని చెప్పారు. అతను మ్రొక్కు తీర్చుకోవటానికి శిరిడి వెళ్ళాడు. అక్కడ సాయి సంస్థానంలో రోజు భోజనం చేస్తున్నాడు. ప్రతి ఏకాదశి లాగా శిరిడిలో కూడా ఏకాదశి నాడు ఉపవాసం వున్నాడు. ఆరోజు రాత్రి సార్ కలలో కనపడి "ఇక్కడ బియ్యం లేవు, పప్పుల్లేవు, స్టవ్ లేదు అంటూ నీ అన్నం నిన్నే వండుకోమని దీక్ష ఇస్తే నువ్విక్కడ ఏం చేస్తున్నావు" అని అంటూ సురేష్ కడుపులో చేయి పెట్టి తెల్ల పురుగులు చూపించి ఇవి ఎప్పుడు తగ్గుతాయి?" అని అన్నారు. దానికి భయమేసి లేచి కొంతసేపటికి పడుకున్న సురేష్ కి మరల సార్ కలలో కనపడి "భయపడకు, తగ్గుతుంది" అని అభయమిచ్చారు. తర్వాత ఒక నెలకి ఆరోగ్యం బాగోలేక గొలగమూడికి వచ్చి స్వామి దగ్గర ఉంటున్నప్పుడు విరేచనాలలో తెల్లటి పురుగులు వచ్చాయి. ఆ తర్వాత అతడు ఆరోగ్యవంతుడైనాడు.

నగేష్ తమ్ముడు గణేష్ కి చిన్నప్పటి నుండి ఇబ్బంది వలన కాలుకి ఆపరేషన్ చేసిన దగ్గర నుండి నేల మీద కాలు ముడుచుకుని కూర్చోలేకపోయేవాడు. శ్రీ వెంకయ్యస్వామి అనాధాశ్రమం కట్టేటప్పుడు గణేష్ విశేషంగా సేవ చేసాడు. చాలా చిత్రంగా అతనికి సోమవారం నుండి శుక్రవారం దాకా ఏ ఇబ్బంది లేకుండా పని చేయగలిగేవాడు. శనివారం, ఆదివారం మాత్రం నొప్పిగా వుండి పని చేయలేకపోయేవాడు. ఆ రెండు రోజులు సార్ దగ్గరకి ప్రతి వారం వచ్చే భక్తులు పనిచేసేవారు. ఇలా జరుగుతుంటే ఒకరోజు సార్ గణేష్ తో "స్వామి దగ్గర 40 రోజులు దీక్ష చెయ్యి. కాలు నొప్పి తగ్గిపోతుంది" అని చెప్పారు. అలానే చేసిన గణేష్ కి కాలునొప్పి పోయి హాయిగా నేల మీద కూడా బాసిపట్లతో కూర్చోగలుగుతున్నాడు. ఒకరోజు గణేష్ కి కాలు నొప్పి (2011 Jan-Mar) వస్తే సార్ మధ్యాహ్నం కల్లా తగ్గుతుంది అని చెప్పారు. అలానే తగ్గిపోయింది.

బెంగుళూరు ప్రసాద్ పొత్తికడుపుతో బాధ పడుతూ సార్ కి SMS ఇవ్వగానే కడుపు నొప్పి తగ్గిపోయింది. సార్ దగ్గర విషయం చెపితే నువ్వు చెప్పగానే స్వామికి తెలిసిపోయిందిలే అన్నారు.

ఒక భక్తురాలికి పెళ్ళయి చాలా సంవత్సరాలైనా బిడ్డలు పుట్టలేదు. ఆవిషయం సార్ కి విన్నవించి బాధపడుతుంటే సార్ రెండు అరటి పండ్లు ఇచ్చి బిడ్డలు పుడతారని ఆశీర్వదించారు. అలానే కొన్ని నెలలకి గర్భం ధరించటం జరిగింది. బాబు పుట్టాడు.

శిరీష (సాయి సుబ్రహ్మణ్యం భార్య) గర్భవతిగా వున్నప్పుడు బాబాకు కబుర్లు చెపుతూ పూలమాలలు వేసేది. ప్రసవానికి కొన్ని రోజుల ముందర భయమేసి తన భర్తకి ఫోన్ చేసి సార్ కి చెప్పమన్నారు. సాయి సుబ్రహ్మణ్యం సార్ కి చెపితే సార్ "కబుర్లు చెబుతూ మీ ఆవిడ పూలమాలలు వేసేది కాదు. స్వామి మీద విశ్వాసం పెంచుకొని నామస్మరణ చేయ"మని చెప్పారు. అలానే చేసిన శిరీషకు సుఖప్రసవం అయ్యింది. ఎక్కడో రాజమండ్రిలో శిరీష బాబాకు పూలమాలలు వేస్తూ కబుర్లు చెప్పటం సార్ కి తెలియటం ఎంత చిత్రమో!

ఒకరోజు మాటల సందర్భంలో భారతి (శివరత్నం cousin) కి కొడుకు పుడతాడని, ఆ పిల్లవాడు Ph.D చేస్తాడని, అతను బాగా చూసుకుంటాడని చెప్పారు. గర్భవతిగా వున్నప్పుడు భారతిని రోజు రెండు గంటలపాటు ప్రదక్షిణలు చేయమని చెప్పారు. తొమ్మిదవ నెలలో ప్రదక్షిణలు చేయటం కష్టంగా వుండి ఇంట్లో వున్నా సార్ పటానికి చెప్పుకుంది. రెండు రోజుల తర్వాత గొలగమూడికి వస్తే సార్ "ప్రదక్షిణలు కష్టంగా ఉన్నాయంటున్నావు మరి అలా అయితే ఖర్మ ఎలా క్షాళన అవుతుందమ్మా? ఓపిక చేసుకొని ప్రదక్షిణలు చేయమ"న్నారు. అలానే చేసిన భారతికి సుఖప్రసవం అయ్యి పిల్లవాడు పుట్టాడు.

ఒకరోజు సాయంత్రం బ్రహ్మంగారి మఠంలో సత్సంగం అయిన తర్వాత సార్ వాళ్ళింట్లో మరలా మాట్లాడుతూ చాలా గంభీరంగా అసలు మన దగ్గర ఏ అర్హత ఉందని స్వామిని ఇది చెయ్యి అది చెయ్యి అని అడుగగలము అని ఇంకా ఇలాంటి విషయాలు చెప్పి, బెంగుళూరు ప్రసాద్ వైపు చెయ్యి చూపిస్తూ "మీ చెల్లెల్ని స్వామికి చెప్పుకుని ప్రతి వారం రమ్మను అని చెప్పి మరలా మాట మారుస్తూ రెండు వారాలకు ఒకసారైనా స్వామి దర్శనానికి గొలగమూడి రమ్మనమని చెప్పు" అన్నారు. ప్రసాద్ వెంటడే 'చెప్పటమైతే చెప్తాను సార్ కానీ అమ్మల్ని తీసుకు వచ్చే బాధ్యత మీదే సార్' అన్నాడు. అంతే ఆ తర్వాతనుండీ ప్రతిరెండువారాలకు ఒకసారి ప్రసాద్ చెల్లెలు (అమ్మలు) స్వామి దర్శనానికి యిష్టంగా తనంత తాను వచ్చేటట్లు చేసారు. సార్ ఈ విషయం అనకముందు

అమ్మల్ని గొలగమూడి రప్పించటానికి ఫోనులో గొడవయ్యేది. సార్ అనంత కరుణతో నన్నే కాకుండా అమ్మల్ని కూడా స్వామి దర్శనానికి గొలగమూడికి మా ప్రార్ధన లేకుండా రప్పించి ఆయన సర్వ సమర్ధత్వం నిరూపించారు.

## బోధనాదక్షత

బెంగుళూరు సాయిశివ తన బలహీనతలు పోవట్లేదని ఆహారం తీసుకోకుండా ఉదయం నుండి గొలగమూడిలో శ్రీ వెంకయ్యస్వామి దగ్గర ప్రదక్షిణలు చేస్తూ వాళ్ళమ్మను ఎవరికీ చెప్పవద్దన్నాడు. సాయంత్రం 4గంటలకు బ్రహ్మంగారిమఠంలో సత్సంగంలో సార్ ప్రారంభిస్తూ అన్నం తినకుండా ఉంటే దాని మీదే మనస్సుంటుంది. హాయిగా తినేస్తే స్వామి మీదే మనస్సు లగ్నం అవుతుంది" అని చెప్పారు. సత్సంగం అయిన తర్వాత ఇంటిదగ్గర "సాయిని ఆసనాలు నేర్చుకోమన్నాను, నీవు కుడా తాత దగ్గర ఆసనాలు నేర్చుకో" అని శివకి చెప్పారు. తర్వాత సార్ ముందర ఆసనాలు వేసి చూపిస్తే బానే చేసావు అన్నారు. తరువాత దర్గాస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు స్వామి "శరీరం కంట్రోల్ లో ఉంటే మనస్సు కంట్రోల్ లో ఉంటుంది. అందుకు ఆసనాలు వేయాలి" అని చెప్పారు. అంటే సార్ కి సాయిశివ అన్నం తినకుండా ప్రదక్షిణలు చేయటం దేనికో తెలుసు, దానికి ఆసనాలు వేయటం పరిష్కారం అని తెలిసినా పైకి ప్రకటించకుండా దర్గాస్వామి దగ్గర విషయం చెప్పించటంలో సార్ యొక్క బోధనాదక్షత, దర్గాస్వామితో అనుబంధం తెలుపుతుంది. మరియు ఎంత గుప్తంగా తన మహిమను ఉంచుతున్నారో అర్ధమవుతుంది.

శివరత్నం ప్రాణాయామం గురించి విని ఉత్సాహపడి నేర్చుకుందామని ఒక ప్రాణాయామం ఆడియో తీసుకుని, దాంట్లో చెప్పినట్లు ప్రాక్టీసు చేస్తున్నాడు. అభ్యాసం విరోచనం తర్వాత చేయాలి. ఒకరోజు విరోచనం రాకపోయేసరికి వెచ్చటి నీటితో ఉప్పు వేసుకొని త్రాగి ప్రయత్నించినా విరోచనం కాలేదు. అంతటితో ఆగక అభ్యాసం చేయటం మొదలు పెట్టాడు. ఏదో అపశ్రుతి జరిగి శ్వాస పీల్చడం కష్టమైంది. ఆరోజు నుండి అకలిలేదు, నిద్రపట్టదు, శ్వాసను బలవంతంగా పీల్చుకోవాల్సి వచ్చేది. యోగాభ్యాసంలో వచ్చే ఇబ్బందులు పరిపూర్ణులైన సద్గురువులే తీర్చగలరని తలచి అనేక దత్తక్షేత్రాలు దర్శించాడు. అయినా ఇబ్బంది ఏమాత్రం తగ్గలేదు. అలా 7 సంవత్సరాలు జరిగిన తర్వాత సార్ దగ్గరకొచ్చి ఇబ్బంది చెప్పుకున్నాడు. సార్ "స్వామి దగ్గర 40 రోజులు దీక్ష చేయమ"న్నారు. శివరత్నానికి మనస్సు నిలవక ప్రదక్షిణలు చెయ్యలేనని చెప్తే సార్ "మనస్సు ఏకాగ్రతగా ఉన్నా,లేకపోయినా నేను చెప్పినట్లు స్వామికి ప్రదక్షిణలు చెయ్యి"

అని చెప్పారు. అలానే చేస్తున్నాడు. ౩౩వ రోజున స్వామి సమాధి దగ్గర కూర్చుని ఉంటే అకస్మాత్తుగా ముక్కు నుండి లోపలికి ఏదో చల్లగా వెళ్లి శ్వాస పీల్చడం సహజంగా జరుగుతోంది. పరుగెత్తుకుంటూ సార్ దగ్గరకి వెళ్ళి చెప్తే సార్ సాయిమాష్టార్ నిలయంలోకి వెళ్లి వెంకయ్యస్వామి పటంతో "స్వామి! నువ్వు ఇది ఖాయం చేయి" అని చెప్పారు. అంతటితో 7సం||ల నుండీ పడుతున్న బాధ తగ్గింది. యోగంలో వచ్చిన ఇబ్బందులు యోగ పూర్ణులే తీసేయగలరు.

ఒక భక్తురాలుకి ఒక పెళ్లి సంబంధం ఇంట్లో వారు ఖాయం చేసారు. ఆ భక్తురాలికి ఆ సంబంధం అంత ఇష్టం లేదు. సార్ కి చెప్తే "అమ్మా! నీ ఇష్టాఇష్టాలు తీసేసి స్వామి ఇష్ట ప్రకారం పెళ్లి చేసుకో, పెళ్ళయిన తర్వాత ఏమైనా ఇబ్బందులు ఎదురైతే స్వామే అవి సరి చేస్తారు" అని చెప్పారు. కొన్ని వారాల తర్వాత మరలా సార్ కి చెప్తే "అమ్మా! నీ ఇష్టాఇష్టాలు సబ్బుతో కడిగేయమ్మా! స్వామి చెప్పినట్లు వింటే ఎప్పుడూ స్వామి మనతో వుంటాడు" అని చెప్పారు. అలానే ఆ  భక్తురాలికి పెళ్ళయింది. కొన్నాళ్ళ తర్వాత భార్య, భర్తలకి మనస్పర్ధలు వచ్చి ఆ భక్తురాలు చాలా బాధగా వున్నప్పుడు సార్ వాళ్ళింటి వారికి ఫోన్ చేసి విషయం చెప్పి కొన్ని నెలలపాటు ఎంతో జాగ్రత్తగా నడిపించి భార్యాభర్తలని దగ్గర చేసారు.

దర్గాస్వామి మీద ఉన్న దురభిప్రాయాయాలను తీసివెయ్యటం

బెంగుళూరు ప్రసాద్ దర్గాస్వామి దర్శనం చేసుకోవటానికి వెళ్ళినప్పుడల్లా "సాయి సకల సాధు స్వరూపము " అనే అధ్యాయం చదువుకుంటూ వెళ్ళేవాడు. కానీ స్వామి ప్రవర్తన వింతగా ఉండేది. దాంతో స్వామి మీద దురభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఒకసారి స్వామి 2003 గురుపూర్ణిమకు రమ్మని పిలిచినా వెళ్ళాలనిపించక విద్యానగర్ వెళ్లి అటునుండి గొలగమూడి వెళ్లి సుబ్బరామయ్య సార్ కి అన్ని విషయాలు చెప్పాడు. సార్ వెంబడే 'శ్రీ గురుచరిత్ర – గేయం' ఇచ్చి రోజు కూర్చుని చదవమని, అగరుబత్తి కూడా సాయిబాబాకి పెట్టమని చెప్పారు. బెంగుళూరు వచ్చి సార్ చెప్పినట్లు చేస్తూ ఉంటే మూడవరోజు మరల "సాయి-సకలసాధుస్వరూపం" అనే అధ్యాయం చదవటం – మాష్టారు(వ్రాసిన conclusions) 'సాయి-అక్కల్కోట్ స్వామి' వేరుకాదు', సాయి గోపాల దాసు వేరుకాదు'  అని చదువుతూ 'సాయి - దర్గాస్వామి వేరు కాదు' అని మనస్సుకి దృడంగా అర్ధమయ్యింది. ఆ క్షణం నుండి దర్గాస్వామి మీద ఉన్న దురభిప్రాయాలు సుబ్బరామయ్య సార్ కృప మరియు గైడెన్సు వల్ల తొలగిపోయాయి. ఇలాంటి దురభిప్రాయాలు తొలగకుంటే భౌతికంగా లభ్యమయిన దత్తస్వామిని దర్శించి ఆశీస్సులు

పొందే భాగ్యం పోగొట్టుకుని ఉండేవాడు. కానీ సార్ చెప్పిన ప్రకారం చేయటం వలన ప్రసాద్ నిర్భాగ్యుడు అవ్వకుండా జరిగింది.

సార్ జిహ్వాచాపల్యము గురించి చెప్పినప్పుడు బెంగుళూరు ప్రసాద్ కి అర్థం కాక బాగా ఆకలేసినప్పుడు కొంచెం ఆహారం ఉప్పు, కారం, నూనె లేకుండా తినేవాడు. ఆఫీసులో ఒక అంతస్తు ఎక్కేసరికి చాలా నీరసంగా ఉండేది. ప్రసాద్ ఈ విషయం సార్ కి చెప్పి జిహ్వాచాపల్యం గురించి సందేహాలు అడుగుదామనుకున్నాడు. కానీ సార్ అలానే ఉండాలంటే ఇక అధ్యాత్మికత లేదు, ఏమీ లేదు అనే పరిస్థితి వచ్చింది. ఆదివారం ఉదయం సార్ కి (సార్ శ్రీ వెంకయ్యస్వామి దగ్గర పూజ చేసి వస్తున్నప్పుడు) చెపితే ఉప్పుకారాలు కనీస అవసరాలు, అవి లేకపోతే ఎట్లా జిహ్వాచాపల్యం అంటే నాకు నేతి వంకాయ కూరే కావాలని అనటం. అదే నాకూ, నా అన్నయ్యకు తేడా అని సార్ చెప్పారు. బ్రతుకు జీవుడా అని చాలా ఆనందం పడ్డాడు ప్రసాద్. ఇది జరిగిన 4 వారాల తర్వాత సార్ చెప్తూ చెప్తూ అసలు నూనె, ఉప్పు వల్లనే అన్ని అనర్థాలు, అవి మానేస్తే ఎంత హాయిగా ఉంటుందో అన్నారు. ప్రసాద్ ని ఉద్దేశించి చెప్పకపోయినా ప్రసాద్ కు ఉప్పు, నూనెలు మానేసినా ఇబ్బంది ఏమీ ఉండదు అనిపించింది. ఈ విషయమే 4 వారాల క్రితం జిహ్వాచాపల్యం గురించి చెప్పినప్పుడు చెప్పి ఉంటే ప్రసాద్ చాలా ఉక్కిరిబిక్కిరి అయ్యేవాడు. అందుకు అప్పుడు చెప్పకుండా కొంత సమయం ఇచ్చి చెప్పటంలోనే సార్ యొక్క బోధనాదక్షత కనపడుతుంది.

శివరత్నం గ్రూపు పరీక్షల preparation కోసమని Hyderabadలో ఉన్న రోజులు. మూడువారాలపాటు సార్ శివరత్నంకు ఫోన్ చేసి మాట్లాడటం, తర్వాత బయట తింటున్నాడు అని ప్రక్కనున్న ప్రసాద్ తో చెప్పి అరిచేవారు. ఈ విషయం శివరత్నం కు ఫోన్ చేసి చెప్పాలనుకుంటాడు ప్రసాద్ కానీ ఏదో కారణాల వల్ల చెప్పటం కుదరలేదు. నాలుగవవారం సార్ అదే విషయం చెప్పుతుంటే ప్రసాద్ కు flash అయ్యి బహుశా ఈ విషయం ఆఫీసులో తినే fruit salad గురించి అయి ఉంటుందని, సార్ ఆఫీసులో fruits తింటున్నాను అని చెప్పాడు. వెంటనే సార్ “నీవు **కోసుకొని** తినలేవా?” అని అన్నారు. అ తరువాత ఈ విషయమై శివారత్నానికి ఫోను చెయ్యలేదు. అంటే బయట చేసే ఆహార పదార్థాల వలన ఏ ఏ చెడ్డ సంస్కారాలు వస్తున్నాయో ఎవరికి ఎరుక. పైగా ఈ చిన్న మాట కూడా ప్రసాద్ కి నాలుగు వారాల ముందరే సార్ కి తెలిసినా సూటిగా చెప్పకూడదా? ప్రక్కవారిలో మనం చూసే లోపాలు వారి మంచి కోరి చెప్పేటప్పుడు మనం ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలో గమనించాలి.

# నియమపాలన

"కోనేరు దాటి పోతే గాడిదతో సమానం" అని స్వామి కలలో సార్ కి చెప్పారు. అలానే సార్ గత 25 సంవత్సరాల నుండి నవంబరులో ఒకరోజు లైఫ్ సర్టిఫికేట్ పెన్షన్ కోసం ఇచ్చి రావటానికి తప్ప ఇంకెప్పుడూ గొలగమూడి దాటి వెళ్ళలేదు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా సార్ నియమపాలన ఎలా చేసారో అద్వితీయము.

సార్ కి ఒకసారి బ్రహ్మం గారి మఠం కడుతున్నప్పుడు ప్లాస్టరింగ్ చేయటానికి కట్టిన చవకల మీద నుండి సార్ క్రింద పడి చెయ్యి విరిగి బాగా వాచిపోయింది. అమ్మగారు నెల్లూరులో వాళ్ళ అమ్మాయి, అల్లుడికి చెప్తే వాళ్ళు అంబులెన్సు తీసుకొచ్చి నెల్లూరికి వెళదామని సార్ ని బాగా ఒత్తిడి చేసారు. సార్ చివరకి వారితో "నేను చావనన్న చస్తాను కానీ నెల్లూరు రాను, స్వామే చేయి విరగగొట్టాడు కాబట్టి ఆయనే చేయి ఇవ్వాలి. అయన నేను ఇలాగే ఉండాలనుకుంటే ఇలాగే వుంటాను తప్ప గొలగమూడి దాటి రాను అని" తేల్చి చెప్పారు. అలానే మొండిగా ఏ మందు వేసుకోకుండా వున్నారు. చెయ్యి దానంతట అదే బాగైపోయింది.

2007 లో సార్ కి కుడి మోకాలు విరిగింది. చాలా చిత్రంగా ఒక గూడూరులో నివాసమున్న ఒక పుత్తూరు డాక్టర్ ని తీసుకొస్తే సార్ కి కట్టు కట్టి సార్ తో 'నాకు పిల్లలు పుడితే శ్రీ వెంకయ్య స్వామి దగ్గరకి వస్తానని మ్రొక్కుకున్నాను, ఎన్నో సంవత్సరాలై పోయింది. ఇప్పటికి గానీ రాలేకపోయాను. మీకు నయం అయ్యే దాకా ఇక్కడికి వచ్చి వైద్యం చేస్తాను' అని చెప్పి అలానే చేసాడు. సార్ కి మూడు నెలల పాటు ప్రక్క మీదే అన్ని జరిగేవి. అలాంటి సమయంలో కూడా భక్తులకి ఎన్నో అనుభవాలు ఆయన సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు అని ఇస్తున్నారు. క్రింద ప్రస్తావించినవి మచ్చుకి ఒకటి.

సురేష్(అల్లంపాడు)కి తన ఇంట్లో తలుపు దగ్గర సార్ ప్రత్యక్షమై "అన్నం తినకపోతే చస్తావు, తిను!" అని గదమాయించారు. అప్పటికే సార్ కి కాలు విరిగి గత రెండు నెలల నుండి మంచం మీదే వున్నారు. ఆ వారంలో శనివారం గొలగమూడి వెళ్ళిన సురేష్ ను "అన్నం తిన్నావా?" అని మొదటి ప్రశ్న వేసి అంతకు ముందు వాళ్ళింట్లో కనపడినది నిజమేనని ధృఢపరిచారు.

సార్ కి 2012 లో పక్షవాతం వచ్చింది. కాళ్ళు, చేతులు, నోరు పడిపోయాయి. డాక్టరు హరిప్రసాద్ గారి మందు తిన్నారు. 3 వారాల అయిన తర్వాత భక్తులతో "ఏదైనా అనుకుంటే అది అయ్యితీరాలా అని, మరలా పైకి లేస్తానని" చెప్పారు. అలానే కొన్ని నెలల్లోనే సార్ కి పక్షవాత లక్షణాలు ఏమీ లేకుండా పోయాయి. ఇలాంటి సమయాలలో కూడా భక్తులకు రకరకాల అనుభవాలిచ్చి వారి విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు

2012 సెప్టెంబరులో సార్ కి పక్షవాతం వచ్చి ఆరోగ్యం బాగో లేనప్పుడు అక్కడే వుండి సార్ కి సేవ చేద్దామని "work from home" క్రింద గొలగమూడి నుండి పనిచేస్తున్నాడు. మంగళవారం ఆఫీసు పని ఎక్కువ వుంటుంది అందువలన ఆఫీసు నుండి ఒక ఈ-మెయిలు వస్తుంది అని అనుకుంటున్నాడు. అప్పుడే సార్ బయట కూర్చోపెట్టమంటే నగేష్ సార్ ని బయట కూర్చో పెట్టాడు. మరలా రావలసిన ఈ-మెయిల్ గురించి ఆలోచనలు వస్తున్నాయి. ఒక 5 ని||ల తర్వాత లోపలకి తీసుకుని వెళ్ళమన్నారు. లోపల మంచం మీద కూర్చోపెట్టిన తర్వాత సార్ నగేష్ ని చూసి నవ్వి వెంటనే గంభీరంగా "ఎన్నిసార్లు టెస్ట్ చేస్తావు? ఒక 50 సార్లు టెస్ట్ చేసావా?" అని అన్నారు. తర్వాత నుండి సార్ కృప వలన ఆఫీసు పని చాలా తక్కువగా వుండి జరగాల్సిన మీటింగులు జరగక పోవటం వలన నగేష్ సార్ కి సేవ చేసుకోగలిగాడు. తరువాత వారం ఆఫీసులో పని ఎక్కువ వుంది. సాయిబాబా ఇచ్చిన అభయం "నా భక్తుని పవిత్ర కోరికలను తీరుస్తాను" అని ఇచ్చినది నగేష్ సార్ కి సేవ చేద్దామనుకున్న కోరికను నెరవేర్చారు.

సార్ దగ్గరకొచ్చే భక్తులు 2013 జూన్ 9న కడుతున్న ధ్యాన మందిరం దగ్గర మట్టి గుంటల్లోకి త్రోసి అక్కడే వున్న చెట్టు క్రింద కూర్చుని సార్ గురించి మాట్లాడుకున్న తర్వాత బయలుదేరి వస్తూ స్వామి ఆశ్రమం దగ్గరకి వచ్చేసరికి పాటోలు వెంకటేశ్వరరావు స్వామి ఆశ్రమం ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ కి ఇవ్వవలసిన పేపర్లు తీసుకు వచ్చాడు. అతను చెపుతూ సార్ ఇప్పుడే అడిగారు "వాళ్ళు పని చేస్తున్నారా? చెట్టు క్రింద కూర్చుని కబుర్లు చెపుతున్నారా?" అని. మేము ఎక్కడో దూరంగా చేసే పని సార్ కి తెలుస్తోందని అందరమూ ఆశ్చర్యంతో నవ్వుకున్నాము. సార్ అన్ని చోట్ల వున్నారు కదా!

## సార్ లేఖలు

శ్రీ సార్ సత్సంగము చేసుకుసేవారికి, విద్యార్థులకు లేఖల ద్వారా లోపాలను సరిదిద్దుతూ సరియైన అవగాహన కలిగించి ఎన్నో ముఖ్యమైన విషయాలు వ్రాసి సరియైన దారిలో నడుచుకునేటట్లు మార్గదర్శనం చేసారు. భక్తి అంటే కేవలం పారాయణ, పూజ, హారతులు, యాత్రలు, సత్సంగం చేసుకోవటమే అనుకొనే ఎందరికో అవి చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, స్వధర్మ నిర్వహణ సక్రమంగా చేయటం, దానికోసం ఎటువంటి నియమపాలన చేయాలో తెలియచెప్పి సరియైన బాటలో నడిపించారు. శ్రీ భరద్వాజ మాస్టర్ గారి లేఖావలి వలే సార్ లేఖావళి కూడా ఎందరికో మార్గదర్శనం చేస్తాయి.

సరియైన సమయానికి వారి వారి మనో వాక్ కర్మలు సరియైన రీతిలో మార్చడానికి సార్ లేఖలను అస్త్రాలుగా (ఆయుధంగా) ఉపయోగించేవారు. అ లేఖలు అనూహ్య మార్పు తీసుకురావడం ఎందరికో విదితం. అవి కేవలం పదాల కూర్పులో, విషయవగాహన కలిగించే

వ్రాతప్రతులు మాత్రమే కాదని, శక్తివంతమైన మంత్రతుల్యాలని ఎందరో విద్యార్థుల, సాధకుల, పెద్దల స్వానుభవము.

సార్ వ్రాసిన ఉత్తరాలు ఎన్నో వందలు ఉండగా, ఇక్కడ కేవలం రెండు, మూడు మాత్రమే మచ్చుతునకలుగా మిగిలిన లేఖలను చదవటానికి ప్రేరితములుగా ఉపయోగపడతాయనే ఉద్దేశ్యంతో ఇక్కడ పొందుపరచటమైనది.

---------------------------మచ్చుకి మొదట లేఖ --------------------------------

గొలగమూడి

17-12-1998

శ్రీమతి భవానీగారికి శ్రీస్వామివారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ పె.సుబ్బరామయ్య వ్రాయడం.

మీ లెటరు చేరినది. ముందు మనం కృషిచేయాలి. తర్వాత శ్రీ స్వామివారి ఆశీస్సులు లభిస్తుంటాయి. వారెంతో కరుణామయులు. మనం వారిని స్మరించని కాలంలో కూడా వారు మనతో ఉండి మనలను కనిపెడుతుంటారు. కానీ నిరంతరం మనతో ఉంటూ మనలను కష్టసుఖాలలో వెంటనంటే దైవాన్ని వదలి మనం అన్ని విధాల బాగున్నప్పుడు వాళ్ళ స్వార్ధానికి ఉపయోగపడుతున్నప్పుడు మాత్రమే మనతో ఉండే స్నేహితులు, బంధువులను మాత్రమే చేరుతుంటాము. వారితో స్నేహం చేస్తుంటాము. ఆ మాత్రం దైవంతో స్నేహం చేయలేము ఇదే మాయ.

మొదట మనం మనకోసం బ్రతకటం నేర్చుకోవాలి. 100 కి 100 మంది ఇతరులు మనలను గూర్చి ఏమనుకుంటున్నారో గనుక వారు మనలను గురించి మంచి అభిప్రాయం కల్గి ఉండేటట్లు జీవించ ప్రయత్నిస్తుంటాము. అది చాలా తప్పు. మనం ఇతరులను గూర్చి ఎంత విమర్శించినా పరోక్షంగా దూషించి వెదికి వారిని దూషించినా మన నోరు బుర్రలు చెడిపోవటం. మనం బాబాగారి ఆజ్ఞలు తప్పడం తప్ప అ వ్యక్తులు ఏమైనా బాగుపడతారా ? లేదు. బాగుపడతారో చెడి పోతారో మనకు అక్కరలేదు. వాళ్ళను విమర్శించి పాపం మూటగట్టుకుంటున్నాము. మానవుడు ఈ దుర్గుణం ఉన్నంత వరకు పాపం పెరుగుతూనే ఉంటుంది. దాని ప్రభావం వలన మానవులు తెలియకుండానే తన కష్టాలను తానే తెచ్చుకుంటాడు.

నేను కుడా మా హెడ్మాష్టరు, టీచర్స్ గూర్చి వారు లేని సమయాలలో విమర్శిస్తుండేది. ఇతరులు నిందిస్తుంటే ఆసక్తిగా వినేవాడిని. నాకు ధ్యానం కుదరలేదని పుజ్యపాదులు ఆచార్య భరద్వాజ మాష్టర్ గారికి చెబితే వారు ఒక్కటే మాటన్నారు. “వాళ్ళు లేకుంటే నీవు బ్రతకలేవా?” అని.

నిజంగా నేను బడిలో చదువు చెప్పినందుకు జీతమిస్తున్నారు. కానీ అందరినీ గూర్చి విమర్శించి, విమర్శలు వినినందుకు కాదు గదా? వీళ్ళ కోసం బాబా మాటనత్రిక్రమించి పంది మలభక్షణం వంటి విమర్శలు మానివేయ తలపెట్టినాను. అంతే ఇక నా డ్యూటి నిర్వహణలో నిమగ్నమై వారికి దూరంగా ఒంటరిగా చెట్ల క్రింద కూర్చొని బాబాతో స్నేహం చేయసాగాను. వివరంగా వ్రాస్తే ఇక రెండు పేజీలు వ్రాయాల్సి వస్తుంది. అది మొదలు నా పాపం తగ్గనారంభించి బాబా కృప అనుభవం కాసాగింది.

నీవు కూడా నీకు తోడు బాబా ఉండాలంటే? మొదట ఈ మానవుల స్నేహాలు, విమర్శలు, మాటలు మానేస్తే మనకు బాబాను గూర్చి చింతన చేయటం, పారాయణ చేయటం, పూజచేయడం, వారి దివ్య లీలలు మననం చేయటం వంటి ఉపయోగకరమైన పనులు చేయటానికి వీలుకలుగుతుంది.

“వాళ్ళు మనం వినకుంటే కోప్పడతారేమో” అని సంశయం విడనాడందే, మనకు మంచి జరిగే ప్రశక్తేలేదు. కష్టాలలో మనలను ఆదుకొనే స్నేహితులైతే మనం చేసే పని (ఇతరులను విమర్శించడం) తప్పు అని మంచి మాటలతో చెప్పి వదలగొట్టుకోవటం. కొందరితోనైతే అసలు స్నేహాలు మానడం, మనకు పిచ్చి పట్టిందని వాళ్ళు అనుకున్నా పరవాలేదు.

2 వది అన్నం తిని చదువుకోవటం కొందరికి వీలు కాదు. నేను, నా కుమార్తె ఇలాంటి వాళ్ళమే, అన్నం తింటే ఇక నిద్రే కనుక అన్నం తినటం అనేది చదువు అయ్యాక పడుకోపోయే ముందు తినడమే. హాస్టలులో అ సమయంలో అన్నం పెట్టరనుకుంటే పూరీ బాక్సులో అన్నం పెట్టించుకొని చిన్న ప్లాస్టిక్ సీసాలో మజ్జిగ పోయించుకొని రూములో పెట్టుకుని 10.30గం||ల ప్రాంతంలో తినేది. ఈ లోగా ఆకలి గదా అనుకుని భరించలేకుంటే రెండు ముద్దలు తినేది. లేకుంటే అట్లాగే ఉంటే అలవాటవుతుంది. చదివింది గుర్తు వుంటుంది. బాగా చదవగలుగుతూ ఉపనిషత్తులలో విద్యార్ధి లక్షణాలు చెప్పారు. **జీర్ణవస్త్రం, మితాహారం, కాకదృష్టి, బకధ్యానం** అన్నారు.

**జీర్ణవస్త్రం:** విద్యయందు తృష్ణగలవాడు తను ధరించే వస్త్రాలంకరణను గూర్చి పట్టించుకోడు. ఎప్పుడూ పాత గుడ్డలే ధరిస్తాడు. కానీ ప్రస్తుత కాలంలో నూటికి 90 మంది విద్యార్ధులకు గుడ్డల పిచ్చే. నాతోటి ఒక స్నేహితుడుండే వాడు, వాడొక రోజున వీపున చినిగి పోయిన చొక్కా వేసుకున్నాడు. స్నేహితులు చూసి విన్నీసు చేశారు. అతనికి తన డ్రెస్ విషయమే పట్టదు. ఎప్పుడూ చదువులో మునిగిపోయి వుంటాడు. అతనిప్పుడు అమెరికాలో గొప్ప రీసెర్చ్ ప్రొఫెసర్ గా వున్నాడు. అతని వలె చదివేవారెవరు?

**మితాహారం:** రుచిగా వున్నదని కాకుండా చదువు పూర్తయినదాకానన్న శరీరం నిలచేందుకు ఆహారం తినాలి. బాగా తింటే బలమొస్తుందని తినకూడదు. బలం వస్తే మనమేమన్నా కుస్తీ పట్టే వస్తాదులము అవ్వాలా ఏమిటి?

**కాకదృష్టి :** కాకికి రెండు కండ్లున్నట్లు మనకు కనపడినా నిజానికి దానికి ఒక కన్ను కనపడదు. ఒకే కంటితో ఎంతో జాగ్రత్తగా చూస్తుంది. అలాగే మన దృష్టి కూడా ఒక్క చదువు పైననే వుండాలి. ఇక కుటుంబ విషయాలు, స్నేహితుల విషయాలు, ప్రపంచ విషయాలు దగ్గరకు రాకూడదు. అప్పుడే సరస్వతీ మాత మనలను వరిస్తుంది.

**బకధ్యానం:** బకము అంటే కొంగ. నీటిలో ఒక కాలుపై నిలబడి వుండి తన కాలు దగ్గరకు వచ్చిన చేపను టపుక్కుమని పట్టుకుంటుంది. మనం కూడా మన ధ్యాసంతా చదువుపైనే ఉంచితే వద్దన్నా చదువు వస్తుంది.

నా కుమార్తె 10వ తరగతి చదివాక చదువు వద్దంటే వద్దన్నాను. ఆమెకు చదువు పిచ్చి. బాగా చదివిస్తే అంతకంటే ఎక్కువ చదివిన అల్లుడిని వెతకాలని, ఎక్కువ కట్నం ఇవ్వలేం గనుక పెద్ద చదువులు చదివిన వాళ్ళను తేలేమని నిర్మొహమాటంగా చెప్పేసాను. ఆమె ప్రైవేటుగా ఓపెన్ యూనివర్సిటీకి కట్టి B.Com పాసయ్యింది. C.A.Ĥ B పాసయ్యింది. బ్యాంకు ఎంట్రన్స్ టెస్ట్ పాసయ్యింది. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యి ఇప్పుడు బ్యాంకులో State Bank of ndiaలో పనిచేస్తోంది. ఆమెకు గుడ్డలు, తిండి అక్కరలేదు. తనను కదిలించకుండా చదువుకోనిస్తే చాలు. కొన్ని విషయాలలో ఆమెను నేను గురువుగా స్వీకరిస్తాను.

కవరులో పేనా పంపడం వీలు కాదు. రీఫిల్ పంపుతున్నాను. అక్కడికి చేరేసరికి పనిచేస్తుందో లేదో సరిగా వ్రాయకుంటే అది ఆశుభమని తలచవద్దు. శ్రీ స్వామివారి సమాధికి తాకించి పంపుతున్నాను.

ప్రస్తుతం పారాయణలు అవసరం లేదు. నిత్యం 10 నిముషాలు గానీ, 15 నిముషాలు గానీ పూజ చేసుకో చాలు. బాబా చెప్పిన పని చేయకుండా మనకిష్టమొచ్చిన పని చేయకూడదు. బాబా మనకు చదివే పని ఒప్పగించారు. అ పని సక్రమంగా నేరవేర్చుకోవాలి గదా. దోవన నడుస్తున్నప్పుడు, ఎప్పుడు తీరికగా ఉన్నప్పుడు పట్టుదలగా వారి నామం చేసుకుంటే చాలు. ఓర్పు, సహనం, ఇతరులకు మంచి చేయడం అన్నీ నిదానంగా వస్తాయి. ముందు మనం చదువులో మునిగిపోవాలి. అందుకు ఆహారనియమం, పట్టుదల అవసరం. మనం చేయవలసిన కృషి చేస్తే బాబా కృప తప్పక కలుగుతుంది. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు. కృషి చేసిన వారికి కరువే ఉండదని భావం. మానవుని ప్రధమ శత్రువు సోమరితనం. దానిని తరిమేందుకు తీవ్రమైన పట్టుదల, శ్రద్ధ వుండాలి. తీవ్రమైన అని మహర్షులు ప్రయోగించారు, దాన్ని సాధించిన వారికి తిరుగులేదు.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పె.సుబ్బరామయ్య

---------------------------మచ్చుకి రెండవ లేఖ --------------------------------

గొలగమూడి

21-05-2002

Dear Sir,

నీ లెటర్ చేరింది. నీ జీవితం నీవనుకున్నట్లు చాల తేలికగానూ, నీచంగాను లేదు. ప్రతి ఒక్కరికి తన తప్పు తెలుసుగోకుండా మూర్ఖంగా జీవించడమంటేనే చీకటి బ్రతుకు. నీ తప్పు తెలుసుకున్నావంటే లైట్ వేశావని అర్థం. ఇక ఇల్లు సర్దుకోవటమే కావాల్సింది.

ఇల్లు సర్దుకోవడానికి గట్టి పట్టుదల కావాలి. ఇది రావాలంటే గురుస్మరణ అవసరం. గురుస్మరణ అంటే అందరు మహనీయుల రూపాలలో వున్న విశ్వగురుని దివ్యలీలలు స్మరించడమే. మన వయస్సు చాలా ఎక్కువ voltage గల యంత్రం వంటిది. దాన్ని నియంత్రణతో ఉపయోగించకుంటే చాలా నష్టపోతాము. ఒకసారి నష్టపడ్డాక ఇక తిరిగి ఆ నష్టాన్ని పూర్తిచేయలేము. గనుక నియమపాలన చాల అవసరం.

నియమపాలన కాదు కఠోర నియమపాలన అప్పుడే సద్గురుకృప పొందగలము. మీరు చెప్పిన పులి విస్తరాకులు ప్రపంచం నిండా ఎక్కడ బడితే అక్కడే కావాల్సినవన్ని వున్నాయి. అసలు అలాంటి వ్యక్తులతో స్నేహమే పనికిరాదు. మనలను బాగుపరచినా, చెడగొట్టినా స్నేహితులే కారణము. గనుక ఈ సత్యాన్ని బాగా మననం చేసి పదిరూపాయలు పోయినా మంచివారి స్నేహం చేయి. పదిరూపాయలు పోయినా ఫరవాలేదు చెడు స్నేహం వదిలేసేయ్.

ప్రతినిత్యం సరైన టైంలో నిద్రపోవడం, సరైన టైంలో నిద్రలేచి నిత్యకృత్యాలు తీర్చుకోవడం చాల ముఖ్యం. స్నేహితులంతా చెడిపోయిన వానిని చూచి నవ్వుతారు. అంతేగానీ ఏ సహాయము చేయలేరు. కానీ సద్గురువొక్కరే మనలను అన్నివేళలా రక్షించి కాపాడుతారు. నీకు సద్గురుకృప వుంది గనుకనే U.S.కి వెళ్ళే యోగం పట్టింది. మన నియమపాలనలో ఏ లోపం వచ్చినా సద్గురుని కృప అంతమేరకు పోగొట్టుకుంటామని ఎందరి అనుభవాలో తెలుపుతున్నాయి. ఈ విషయంలో నీవు చాలా జాగ్రత్తగా వుండు. ధర్మం, ధర్మం, ధర్మం ఇది మాత్రమే సద్గురుని మెప్పిస్తుంది. ధర్మం తప్పినాక main line తో electrical contact పోయిందన్నమాట. అది పోతే మనమెందుకూ పనికిరాము.

ఆ అమ్మాయి విషయం మనస్సులోకి రానివ్వడమే దోషము. వారు నీతో మాట్లాడతారని ఎందుకు ఊహిస్తున్నావు. మాట్లాడితే కూడా ధర్మం ప్రకారం వుండాలి. కానీ అనవసరమైన ఆపేక్షలు పెంచుకోవడం అధర్మం. ఈ వివాహానికి పెద్దల అనుమతిగానీ, సద్గురిని ఆదేశం గానీ లేవు గనుక బాగా దూరం వుండు. సద్గురుడు ఆదేశిస్తే ఆయననే జరిపించమని చెప్పి నిర్భయంగా వుండు. నీవు వారితో నోరు జారి ఎక్కువగా మాట్లాడవద్దు. Control Your Spirits. ఇది ముఖ్యం. శ్రీ స్వామివారికి నీ బాధలు విన్నవించుకో. నీ లెటర్ స్వామివారి సమాధి మీద వుంచాను. అన్నీ వారే చూసుకుంటారు. Be brave and devoted to Sadguru.

Yours Lovingly,

పెసల సుబ్బరామయ్య

---------------------------మచ్చుకి మూడవ లేఖ ---------------------------------

గొలగమూడి

07-07-1999

పూజ్యులైన లక్ష్మిగారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు. మీకు లెటరు వ్రాయడంలో నా ఉద్దేశ్యము నాకు ఎక్కువ తెలుసునని కాదు. నా భావాలు మీతో పంచుకున్నందున లెటర్ ద్వారా సత్సంగం అని మాత్రమే.

నేను ఇంతకుముందు చివటం అమ్మ చరిత్ర 2,3 సార్లు చదివాను. కానీ ఈ వాక్యం మాత్రం నా హృదయానికి హత్తుకోలేదు. అమ్మ బోధ అనే అధ్యాయంలో 94వ పేజి శారదా వివేక్ గారు వ్రాసిన పుస్తకంలో మూడవ పేరాగ్రాఫ్ లో "వత్తమైనా వచ్చిందంటే" అన్నారు అమ్మమాట. అ మాట అందరు భక్తులు తర్కించి యోచించి హృదయగతం చేసుకోవలసిన వాక్యము. ఏ మహనీయుని దగ్గరకైనా, దేవాలయనికైనా ఎలా వెళ్ళాలి అనే విషయం అమ్మ బోధిస్తుంది. ఇది నాకు గొప్ప బోధ. ఇది శ్రీ మాస్టర్ చెప్పిన మాటకు మరో రూపము. కనీసం నామజపం, పారాయణ, ధ్యానం లాంటి కాలక్షేపాలతో చేరాలని వారి బోధ.

అ భక్తురాలికి అది పాఠమైతే నాకొక గొప్ప బోధ చేసారు. "ఉండటమైనా నీకు వచ్చిందా" అని అడిగినట్లుంది. శ్రీ వెంకయ్యస్వామి వారి సన్నిధిలో ఎలా ఉండాలి. ఇంతటి గొప్ప సన్నిధి లభించినా దాన్ని సద్వినియోగం చేసుకుంటున్నానా? లేదు. అమ్మే నన్ను చెప్పుతో కొట్టినట్లు ఉంది. అందుకే మాస్టర్ "ఇచ్చిన అవకాశము సద్వినియోగం చేసుకోకుంటే బూడిదై రాలిపోతావు" అన్న ఆదేశానికి చక్కగా సరిపోయింది. మహాత్ములు సమాధి చెందాక గూడా మనతో మాట్లాడడం ఇదేననుకుంటాను. ఇక దీనిని గూర్చి వారి వారి శక్త్యనుసారం ఆలోచించుకోవచ్చు.

శ్రీ పాకలపాటి గురువుగారి చరిత్ర చదవటం 3వ సారి అనుకుంటాను. అందులో ముఖ్యంగా చరమ సందేశం అనే అధ్యాయం నన్నెంతగానో ఆకట్టుకుంది. అహం అంటే ఎంత సూక్ష్మంగా వుంటుందో చూడండి. గాయత్రీ సిద్ధి అంటే ఏమిటి? ఉపదేశాలు, నామజపం, మంత్రజపం – ఎన్ని విధాలైన బోధలో. అదే పుస్తకం 16, 17 పేజీలలో "ఆ తలంపు రావడం ఆ పని చేయడం వేరు కాదు" అన్నారు. ఎంత అమోఘమైన బోధ. మానసికంగా వ్యభిచరించని వారు మొదటి రాయి వేయండి అన్న క్రీస్తు వాక్యాన్ని తలపిస్తుంది. అలాగే పేజి 68, 75, 76 మరలా మరలా చదవాలి. మననం చేయాల్సిన బోధలు.

మహాసమాధి అనంతరం ఇట్టి దివ్యబోధలు చేస్తున్న శ్రీ మాస్టర్ కి ఋణం చెల్లించడం ఎలాగో తెలియదు. అంతటా నిండియున్న అ పరతత్వమే తానైన వారి ఆజ్ఞలు పాటించే ప్రయత్నం చేసి వారికి కృతజ్ఞత తెలుపుకుందాం. ఆచరణలో సఫలం కావాలంటే వారి దయలేక ఎన్ని జన్మలైనా సఫలం కాలేను.

నమస్కారములతో
పె.సుబ్బరామయ్య

# మహా సమాధి

సార్ 2017 వ సం|| జూన్ 9వ తేదిన (జ్యేష్ట శుద్ధ పౌర్ణమి) ఉదయం 7 గం|| 20 ని||లకి (జూన్ 9 వ తేది) కన్నుమూసారు. సార్ భౌతికదేహాన్ని శ్రీ సాయి మాస్టర్ నిలయంలో సమాధి చేసారు. సార్ తమ పరిమిత శరీరం వదలి విశ్వ చైతన్యులై సమాధి చెందిన తర్వాత కూడా భక్తులకు అయన నిత్యసత్యులని అనుభవాలిస్తున్నారు.

దమ్మపేట నుండి వచ్చిన ఒక పెద్దావిడ సార్ సమాధి చూసి మామూలు మనిషిని సమాధి చేయటమేమిటని అనుకుని జూన్ 10వ తేది ఉదయం 10గం||30ని||లప్పుడు శ్రీ సాయి మాస్టర్ నిలయంలో పడుకుంటే సార్ ఫోటోలో నుండి బయటకు వచ్చి దత్తాత్రేయుని ఫోటోలో కలిసిపోయారు. వెంబడే మెలుకువ వచ్చిన ఆవిడకి మనస్సులో 'సుబ్బరామయ్యగారికి, దత్తాత్రేయునికి తేడా లేదని' అనిపించి సార్ సమాధి వద్ద వున్న వేణుగోపాల్ గారితో చెప్పింది.

బెంగుళూరు శైలజ అనే భక్తురాలు సార్ సమాధి దర్శనము అయిన తర్వాత శ్రీ దర్గాస్వామి దర్శనము చేసుకుంది. శ్రీ దర్గాస్వామి ఆశిస్సులు ఇస్తూ "నీకేమమ్మా, సుబ్బరామయ్య నీకు ఎప్పుడూ తోడు వుంటాడు" అని చెప్పారు. అంటే సార్ నిత్య సత్యులని స్వామి చెప్పటం భక్తులందరికీ ఎంత భరోసానో కదా!

సాయి సుబ్రహ్మణ్యం ఎలా తనను సార్ నిర్నిద్రులై కాపాడుతున్నారో చెపుతున్నారు:

శ్రీ సుబ్బరామయ్య సార్ సమాధి చెందిన రెండవరోజు సార్ సమాధి కార్యం అయ్యాక తరువాత సార్ కి ఏమి చేయాలా అనే ప్రస్తావన వచ్చింది. అచ్చటివారు 13వ రోజు ఏమి చేయాలో నిర్ణయించారు. నేను మరురోజు ప్రయాణం చేస్తూ నగేష్ తో సంభాషణలో సార్ మనల్ని సొంత బిడ్డలలాగా చూసారు, మనకు తండ్రి కంటే ఎక్కువ కదా సార్ సమాధి అనంతరం మహాత్ములకు ఏ కార్యం చేస్తే బాగుంటుంది అని కొంత డిస్కషన్ వచ్చింది. మనస్సులో తండ్రి ఉత్తమగతుల కోసం కుమారులు చేసే క్రియలు ముఖ్యమని భరద్వాజ మాస్టర్, సార్ (శివనేశన్ స్వామి మాటలు) చెప్పినది గుర్తుకు వచ్చి సార్ కు ఏదో కొంచెమైనా చేయాలనిపించింది. అ రోజు రాత్రి కలలో ప్రాణం లేకుండా ఉన్న సార్ శరీరాన్ని స్నానం చేయించడానికి కూర్చోబెట్టడం చేస్తున్నారు. అంతలో సార్ శరీరంలోకి ప్రాణం వచ్చి "ఓం సాయినాథాయ నమః, ఓం గురుదేవ" అని పలుకుతున్నారు. వెంటనే కొంతమంది సార్ కి ప్రాణం వచ్చిందని ఫ్యాన్ తీసుకు వస్తున్నారు. ఈ స్వప్న దర్శనంతో ఉత్తమగతికై సామాన్యులకు చేసే క్రియల కన్నా మృత్యువుపై ఘన విజయం సాధించిన మహాత్ములకు

ఉత్తమ లోకాల నుండి వారి ఆశీస్సులు మనకు అందేందుకు కృతజ్ఞతగా చేయవలసిన పూజ, నిత్య నైవేద్యం (కొంత ఎక్కువగా) ఇస్తే బాగుంటుందని సార్ ప్రేరణగా భావించాను.

ఆ ప్రేరణతో రోజూ లఘు పూజ, సార్ కు నైవేద్యంగా ప్రతిపూట కొంత ఎక్కువగానే నివేదించటం ప్రారంభించాను. కొన్ని రోజుల తర్వాత ఒక టూర్ కు వెళ్ళవలసి వచ్చి ఆ ప్రయాణాలలో రెండు మూడు రోజులు శ్రద్ధగా నివేదన చేయలేదు. అ తర్వాత రోజు రాత్రి సార్ కలలో నగేష్ వడిలో తలపెట్టుకుని కనిపించారు. సార్ నాకు ఏదో పనులు వరుసగా ఆదేశించి చేయిస్తున్నారు. ఇంతలో ఒకరెవరో అవధూత లీల గ్రంథాన్ని ఇమ్మని అడిగారు. నేను ఇస్తాను అన్నాను కానీ నేను సార్ దగ్గరే కూర్చున్నాను. సార్ నన్ను 'పద పద, ఒప్పుకున్న పని క్షుణ్ణంగా చేయాలి' అన్నారు. నన్ను శ్రద్దగా లఘుపూజ, మూడుపూటలా తగినంత నివేదన చేయమని సార్ హెచ్చరిస్తున్నారని స్ఫురింపచేసారు. సార్ సమాధి చెందినా నిత్యసత్యులని తెలిపి వారి కృపకు కృతజ్ఞతగా లఘుపూజ, నైవేద్యం చేయటం మొదలుపెట్టించి దానిలో జాప్యాన్ని భౌతికంగా వున్నప్పుడు ఎలా హెచ్చరించేవారో అదే రీతిలో ఇప్పటికీ హెచ్చరిస్తూ నడిపిస్తున్నారు.

సార్ గారి భార్యగారికి (అమ్మగారికి) 27 జున్ 2017 రాత్రి స్వప్న వృత్తాంతం:

''అయ్యవారు పిలుస్తున్నారని చెప్పటం వలన అమ్మగారు సాయి మాస్టర్ నిలయంకి వచ్చారు. అక్కడ సార్ చాలామందితో కలసి పనిచేస్తున్నారు. అమ్మగారిని చూసిన సార్ ఒక వస్తువిచ్చి తోమి కడుక్కురమన్నారు. తోమి కడిగి తీసుకు వచ్చిన తర్వాత సార్, అమ్మగారు అక్కడ పనిచేసే చిన్నపిల్లవాడిని చూసి నవ్వుకున్నారు. తర్వాత అమ్మగారు సార్ తో 'ఏడకి పోయావు, ఇంటికి రా' అన్నారు. సార్ "నేను ఎక్కడికీ పోలేదు. నేనింటికి రాను, నేనిక్కడే ఉంటాను' అని చెప్పారు.

సార్ భార్యగారికి (అమ్మగారు) సార్ కలలో కనపడిన విషయాన్ని హైదరాబాద్ వీరప్రతాప్ జూన్ 29వ తేదిన తన భార్యతో చెప్పాడు. ప్రతాప్ భార్య పడుకోబోయే ముందు 'సార్ నాకు దర్శనం ఇస్తారా? అక్కడికి వెళ్లేవారికి మాత్రమే ఇస్తారు కాబోలు' అని అనుకుంది. రాత్రి కలలో సార్ ఇలా చెప్పారు

"అక్కడికి వస్తేనే దర్శనం ఇస్తాను అని కాదు, కల్మషం లేని మనస్సుతో ఎవరు ఎక్కడ అనుకున్నా వాళ్ళకు దర్శనం ఇస్తాను. కల్మషం లేని మనస్సు ఎవరికి ఉంటుందో వారికి నా ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుంది.

తన భవిష్యత్ గురించి భయమేస్తోంది అన్నదానికి సార్ ఆమెకు 40సం||లు అప్పుడు, 50సం||లు అప్పుడు, 60సం||లు అప్పుడు ఎలా వుంటారో చూపించి, "చూడు ఇక్కడ ఎంత సంతోషంగా ఉన్నారో, ఏమీ దిగులుపడకు" అని చెప్పారు